
ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఫిబ్రవరి 2010

వెల : రూ. 10



సురభి

నేను (ప్రవ్రాజిక భారతీప్రాణా) అమ్మ దగ్గర జయరాంబాటీలోనూ, ఉద్బోధన్‌లోనూ ఉన్నాను. కాశీలో కూడా ఒక నెల ఆమెతో ఉండటం జరిగింది. నాకు ఎనిమిది తొమ్మిదేళ్ళ వయస్సు ఉన్నప్పుడు ఆమెను తొలిసారి దర్శించాను. కానీ పదిహేడేళ్ళ వయస్సు నుండి ఆమె సన్నిధిలో ఉండడం ప్రారంభించాను. అమ్మ ఉద్బోధన్‌లో తన గదిలో నాకు మంత్రదీక్ష ఇచ్చారు. ఆమె తెల్లవారి మూడింటికే లేచేవారు, ముఖం చేతులు కడుక్కొని, బట్టలు మార్చుకొని జపానికి కూర్చొనేవారు. నేను కూడా అదే సమయానికి లేచేదాన్ని కానీ నేను ప్రక్కనే నేలమీద నిద్రపోయేదాన్ని.

నేను అమ్మను నా ఆత్మీయురాలిగా మాత్రమే ఎరుగుదును. ఆమె దైవీస్వరూపం నాకేమి ఎరుక? ఒకరోజు ఆమె నన్ను అనుగ్రహించి, తన స్వస్వరూపాన్ని సూచనప్రాయంగా స్వయంగా తెలిపారు. ఉద్బోధన్ గృహం డాబాపై ఆమె యథాప్రకారం శిరోజాలు ఆరబెట్టుకుంటున్నారు. ఏదో పనిమీద అక్కడకు వెళ్ళగా, నన్ను ఒక పువ్వు తీసుకురమ్మన్నారు, నేను తీసుకొని వెళ్ళాను. తన పాదాలు చూపారు. అప్పుడు శ్రీశారదామాతలో ఆదిపరాశక్తి రూపాన్ని దర్శించి ఉక్కిరిబిక్కిరయ్యాను. ఆ కుసుమాన్ని ఆమె పాదాలపై ఉంచి, దండ ప్రణామం అర్పించాను. కొద్దిసేపట్లోనే అమ్మ ఎప్పటిలాగే సాధారణ స్త్రీలాగ కూర్చొని ఉంది" ❖

(ప్రవ్రాజిక భారతీప్రాణా స్మృతుల నుంచి)



ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ


సంపుటం: 67 | సంచిక: 2 | ఫిబ్రవరి 2010




మ్రింగెడు వాడు విభుండని,
మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ,
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!

మ్రింగేవాడు తన భర్తని తెలిసీ, మ్రింగేది విషమని తెలిసీ దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుందనే ఉద్దేశంతో సర్వమంగళ అయిన ఆ పార్వతీదేవి మ్రింగమని చెప్పింది. ఆమె తన మనస్సులో తన మంగళసూత్రాన్ని ఎంతగా నమ్మిందో! *(పోతన భాగవతము)*

లోపలి పేజీల్లో...



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: డాక్టర్ కె. మల్లికార్జునరావు, ఎస్.వి. విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502	30,000
మహారాజ పోషకులు	: శ్రీ వై. వేంకటేశ్వర్లు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా - 507 101	10,000
రాజపోషకులు	: శ్రీమతి పి. నర్మద కృష్ణ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ - 500 073	5,000
పోషకులు	: శ్రీ ఒ.వి.ఎస్. రాఘవయ్య, వైఢన్, సిద్ధి జిల్లా, మధ్యప్రదేశ్ (కీ॥శే॥ ఓరుగంటి వసంత జ్ఞాపకార్థం)	1,000
పోషకులు	: శ్రీ ఎ. అనిల్ కుమార్, మోతీనగర్, హైదరాబాద్ - 500 018	1,000
పోషకులు	: శ్రీ తాతవర్తి వెంకటసుబ్బయ్య, వేమూరు, గుంటూరు జిల్లా - 522 261	1,000
పోషకులు	: శ్రీమతి కె. లక్ష్మీ తులసమ్మరెడ్డి, రాయవరం, తూర్పు గోదావరి జిల్లా - 533 346	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

చందా వివరాలు	ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి :	రూ. 10	-
ఒక సంవత్సర చందా :	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు :	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు :	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు :	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

'నేను' పోతే 'ముక్తి' నీదే!



ఒక యువకుడు 'ముక్తిమార్గం' తెలుసుకోవాలని ఓ గురువును ఆశ్రయించాడు. కొద్ది రోజులు ఆశ్రమవాసం చేసిన తరువాత గురువును సమీపించి, 'గురువర్యా! దయచేసి నాకు ముక్తిమార్గం తెలుపండి' అని ప్రార్థించాడు. అందుకు గురువు "నాయనా! 'నేను' పోతే నీకు 'ముక్తి' లభిస్తుంది" అని అన్నాడు. ఆ సమాధానం విన్న శిష్యుడు ఆశ్చర్యంతో "గురువుగారూ! మీరు పోతే మాకు దిక్కెవరు? మాకు మీరే మార్గదర్శకులు. దయచేసి అలా అనకండి" అని అన్నాడు. అప్పుడు ఆ గురువు గారు "నాయనా! 'నేను' అనే అహంకారం పోతే 'ముక్తి' లభిస్తుంది" అని వివరంగా బోధించాడు.



సాధారణంగా అహంకారం మనలో లేదనీ, ఇతరులలో ఉందనీ భావిస్తాం. నిజానికి 'నాలో అహంకారం లేదు' అని అనుకోవడం కూడా ఓ అహంకారమే! ఈ అహంకారాన్ని గుర్తించి దాన్ని నిర్మూలిస్తే గానీ ముక్తి సాధ్యం కాదని వశిష్ఠుడు, శ్రీరాముడికి *(యోగ వాశిష్ఠం)* బోధించాడు.

'అహంకారానుసన్ధాన వర్జనాదేవ రాఘవ... తీర్యతే భవసాగరః' – 'ఓ రామా! అహంకారానికి హేతువైన వాటిని వర్జించినప్పుడే సంసార సాగరాన్ని దాటడం సాధ్యం'.

'అహంకారా'నికి అనంత రూపాలు

మనలోని అహంకారం విభిన్న రూపాలను ధరించి ముక్తిమార్గాన్ని మరిపించేలా చేస్తుంది. ధన అహంకారం, పాండిత్య అహంకారం, అధికార అహంకారం – ఇలా అహంకారం ఎన్నో రూపాలు ధరించి మోక్షమార్గానికి ఎలా అవరోధం అవుతుందో శ్రీరామకృష్ణులు ఇచ్చిన ఉదాహరణలు ఒక్కసారి గుర్తుచేసుకొని జాగ్రత్త వహిద్దాం:

★ **ధనాహంకారం :** ధనానికున్న శక్తి ఎలాంటిదంటే నోరు లేని ప్రాణుల్లో సైతం గర్వాన్ని పెంచుతుంది. ఓ కప్ప ఒక రూపాయి సంపాదించింది. ఒకరోజు ఓ ఏనుగు ఆ కప్ప నివసిస్తున్న బిలం మీద నుంచి వెళుతూ ఉంది. ఆ ఏనుగును చూసిన కప్ప కోపంతో 'నా ఇంటి మీద నుంచి వెళ్ళడానికి నీకు ఎంత ధైర్యం' అంటూ ఏనుగును తన్నడానికి కాలెత్తిందట. ఏనుగు శక్తితో పోలిస్తే కప్ప శక్తి ఏ మాత్రం? దీన్నిబట్టి ఎదుటివారి శక్తి సామర్థ్యాలను మరిపించేటంతటి అహంకారం ధనంతో వస్తుందని అర్థమవుతోంది.

అలాగే ధనం పెద్ద, చిన్న తారతమ్యాన్ని మరిచి ప్రవర్తించేలా చేస్తుంది. ఒక వ్యక్తి శ్రీరామకృష్ణులను దర్శించ డానికి అప్పుడప్పుడు దక్షిణేశ్వరం వెళ్ళేవాడు. శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తి శ్రద్ధలున్న అతడు ఒకసారి ఆయన్ని చూసి 'ఏమోయ్ పూజారీ! ఎలా ఉన్నావు?' అంటూ అవహేళనగా పలకరించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు తన పక్కనే ఉన్న హృదయ్‌తో 'ఇతడు కాస్త ధనం సంపా దించినట్లున్నాడు' అని అన్నారు.

ఒకతను కాయగూరలు కొనడానికి బజారుకు వెళ్ళాడు. అతడు కాయగూరలు అమ్ముతున్న స్త్రీ తన కుడిచేతికి ఉన్న బంగారు ఉంగరాలు చూడాలనే ఉద్దేశంతో చేత్తో కాయగూరల్ని అటూ ఇటూ కదుపుతూ బేరసారాలు చేయసాగాడు. అతడి ఉద్దేశం గ్రహించిన ఆమె కూడా తాను ధరించిన నగలు అతడు చూడాలని తలాడిస్తూ బదులు చెప్పింది.

ఒక్క రూపాయి నాణెం ఉన్న కప్ప ఏనుగునే తన్నడానికి సిద్ధమైంది. ఒకప్పుడు మహాత్ముల పట్ల ఎంతో భక్తిశ్రద్ధలను ప్రదర్శించిన భక్తునికి కొంత ధనం చేకూరగానే గర్వం ఆవహించింది. చివరికి సిరులు గల వారిద్దరూ ఒక చోట చేరితే తమ అహంకారాన్ని ఎలా ప్రదర్శిస్తారో అంగడిలో జరిగిన సన్నివేశం ద్వారా ఊహించవచ్చు.

మనిషిలో ధనం వల్ల కలిగే అహంకారం ఎన్ని విధాలుగా వ్యక్తమవుతుందో తెలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు ఇచ్చిన పై మూడు ఉదాహరణలు ఆయన సునిశిత పరిశీలనాశక్తికీ, సూక్ష్మదృష్టికీ నిదర్శనాలు. ఈ ఉదాహరణలను దృష్టిలో ఉంచుకొని సావధానులమై వ్యవహరించడానికి ప్రయత్నిద్దాం.

★ **పాండిత్య అహంకారం:** వినయాన్ని పెంచేదే నిజమైన విద్య. సాధారణంగా విద్యాధికులు ఇతరులకు ఏమీ తెలియదనీ, తమ కన్నా ఉన్నతమైన పాండిత్యం కలవారు ఎవరూ లేరనీ భావిస్తుంటారు. తామే సర్వజ్ఞులమనే అహంకారంతో వ్యవహరిస్తారు. అలాంటి పండితుడిలోని

అహంకారాన్ని శ్రీరామకృష్ణులు ఎలా తొలగించారో ఈ క్రింది సంఘటన తెలియజేస్తుంది:

గౌరీ పండితుడు ప్రసిద్ధ తాంత్రిక సాధకుడు. శాస్త్ర చర్చలో అతణ్ణి ఓడించినవారే లేరు. అతడు శాస్త్రతర్కం ప్రారంభించే ముందు ప్రత్యర్థిలోని శక్తిని నిర్వీర్యం చేయడానికి 'హా, రే, రే, రే...' అని బిగ్గరగా ఉచ్చరించేవాడు. ఒకసారి గౌరీ పండితుడు దక్షిణేశ్వరానికి వచ్చి 'హా, రే, రే, రే...' అంటూ మేఘగర్జనను తలపించేలా ఉచ్చరించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అంతకంటే బిగ్గరగా 'హా, రే, రే, రే...' అని ఉచ్చరించారు. ఇలా ఒకరిని మించి మరొకరు బిగ్గరగా 'హా, రే, రే, రే...' ఉచ్చరించసాగారు. చివరికి గౌరీ పండితుడు శక్తిని కోల్పోయి శ్రీరామకృష్ణుల కన్నా బిగ్గరగా ఉచ్చరించలేక తన ఓటమిని అంగీకరించి, ఆయన పాదాలకు ప్రణమిల్లాడు. 'భగవద్దర్శనానికి ఉపయోగపడని పాండిత్యం నిష్ప్రయోజనం' అని శ్రీరామకృష్ణులు బోధించారు. అప్పటి నుంచి గౌరీ పండితుడు అహంకారాన్ని వీడి, ఆధ్యాత్మిక అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశాడు.

★ **అధికార అహంకారం:** అధికారంలో ఉన్నవారు అంతా తాము చెప్పినట్లే జరగాలనీ, తాము తీసుకున్న నిర్ణయాలే ఉత్తమమైనవనీ భ్రమించడం, ఆధిపత్యాన్ని చలాయిస్తూ ఇతరులను వేధించడం, శిక్షించడం, అవమానించడం లాంటివి నిత్య జీవితంలో చూస్తూనే ఉంటాం. ప్రాపంచిక జీవితంలో ఉన్నవారే కాదు ఆధ్యాత్మిక మార్గంలో సత్పురుషులుగా అందరి ఆరాధనలూ అందుకుంటున్నవారు కూడా భగవంతుని శక్తిని మరిచి, 'నేను సత్పురుషుణ్ణి, నేను ఆధ్యాత్మిక మార్గదర్శిని' అనే అహంకారంతో ప్రవర్తిస్తారు. ఈ అహంకారం ధనం, విద్యల వల్ల వచ్చే అహంకారాల కన్నా అత్యంత ప్రమాదకరమైనది. అలాంటి అహంకారంతో ఓ ఆధ్యాత్మిక గురువు ఎలా ప్రవర్తించారో తెలియజేసే ఒక సంఘటన చూద్దాం:



భగవాన్‌దాస్ బాబాజీ ఓ ప్రముఖ వైష్ణవ గురువు. ఒకరోజు శ్రీరామకృష్ణులు ఆయనను దర్శించడానికి వెళ్ళారు. అదే సమయంలో బాబాజీ ఒక భక్తుణ్ణి 'నిన్ను వైష్ణవ సమాజం నుంచి బహిష్కరిస్తున్నాను. ఇక మీదట నువ్వు ఇక్కడకు రావద్దు' అని హెచ్చరిస్తున్నారు. భక్తుణ్ణి దూషించడాన్ని శ్రీరామకృష్ణులు విని, 'బాబాజీ! భక్తుల్ని బహిష్కరించడానికి మీరెవరు? సకల చరాచర సృష్టినీ నడిపించే ఆ సర్వేశ్వరుడు ఉండగా ఇంకొకరికి బోధించడానికి మీరెవరు! 'నేను బోధకుణ్ణి' అనే అహంకారం మీలో ఇంకా పోలేదు' అని మందలించారు. శ్రీరామకృష్ణుల మాటలు తాను మత గురువుననే అధికార అహంకారంతో ప్రవర్తించిన బాబాజీలో పరివర్తన తెచ్చాయి.

అహంకారాన్ని అంతమొందించే అస్త్రం

'నేను, నాది' అనే భావం లేకుండా జీవించడం ఎలా సాధ్యం?' అనే సందేహం మనలో కలగకమానదు. కేశవ్ చంద్రసేన్ అనే భక్తుడు కూడా శ్రీరామకృష్ణులను ఇదే ప్రశ్న అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా బదులిచ్చారు:

"అహంకారం రెండు రకాలు - పక్వాహంకారం, అపక్వాహంకారం. 'నేను భగవంతుని చేతిలో పరికరాన్ని. నేను ఏం చేస్తున్నా, అనుభవిస్తున్నా ఆ భగవంతుని ఇచ్ఛానుసారమే జరుగుతుంది' అనే భావం- 'పక్వాహంకారం'. ఇలాంటి అహంకారం వల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదు.

'ఇది నా ఇల్లు, నా బిడ్డలు, నా శరీరం. అంతా నా వల్లనే జరుగుతుంది' అనే భావన - 'అపక్వాహంకారం'. ఇది భవబంధాలకు హేతువు."

'మమేద మితి బన్ధాయ నాహ మిత్యేవ ముక్తయే...' -యోగ వాశిష్ఠం

"ఈ 'గృహం, ధనం మొదలైనవి నావి' అనే భావన బంధానికి మూలం. 'ఇవి నావి కావు, ఈ శరీరం నేను కాను' అనే భావనే మోక్షానికి మార్గం" అని శ్రీరామునికి, వశిష్ఠ మహర్షి బోధించాడు.

అయితే ఈ అహంకారాన్ని అంతమొందించడం ఎలా? అహంకారం మన అధీనంలో ఉన్నంత వరకూ దానివల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదు.

భగవంతుని సేవకులం, బిడ్డలం అని భావించిన వారిలో అహంకారం ఉండదు. శ్రీరామకృష్ణులు సర్వవేళలా, సర్వావస్థల్లోనూ ఆ జగజ్జనని కాళీమాత మీదే సంపూర్ణంగా ఆధారపడి, సకల విధుల్నీ నిర్వర్తించారు. పసిబిడ్డలా అన్నింటికీ ఆ అమ్మ పైనే ఆధారపడిన ఆయనలో అహంకారం ప్రవేశించడానికి అవకాశమెక్కడిది! కాబట్టి మనం కూడా ఆ భగవంతుని బిడ్డలమనే భావనతో ఆయనపైనే ఆధారపడి విధుల్ని నిర్వహించినప్పుడు అహంకారం పొడసూపదు. మనలోని ఆ 'నేను' పోతే మనమంతా భవబంధ ముక్తులమే! పరమాత్మ సన్నిధికి అర్హులమే! ❖

– స్వామి సుప్రియానంద

భావములోన బాహ్యము నందున...

'భావములోన బాహ్యము నందును గోవింద గోవింద యని కొలువవో మనసా...' ఇది తాళ్ళపాక అన్నమాచార్యుల కీర్తన. నిజమైన భక్తులం కావాలంటే భావములోనూ, బాహ్యమునందూ ఒకే విధంగా వ్యవహరించాలి. అయితే నిజమైన భక్తి ఎలా కలుగుతుంది? సాధుసాంగత్యం, విశ్వాసం, ఇష్టనిష్ఠ – ఈ మూడు లక్షణాలు మనలో ఉన్నప్పుడు నిజమైన భక్తి కలుగుతుందని శ్రీరామకృష్ణులు ఉద్బోధించారు.

1. సాధుసాంగత్యం : మఠాలు మాకు దగ్గరలో లేవు అందువల్ల మాకు సాధుసాంగత్యం లభించడం లేదు అంటూ చాలా మంది భక్తులు వాపోతారు. నిజానికి 'శ్రీరామకృష్ణ కథామృతం' రోజూ చదవడం అలవరుచుకుంటే దాన్ని మించిన సాధుసాంగత్యం ఇంకేముంటుంది!

2. విశ్వాసం : భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం ఉంటే మన యోగక్షేమాలకు ఆయనే బాధ్యత వహిస్తాడు. కానీ భగవంతుని పట్ల మనకున్న విశ్వాసం ఎలాంటిదో శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ కథ తెలియజేస్తుంది:

ఒక రేవు వద్ద చాకలి వాళ్ళు బట్టలు ఉతికి నేలమీద ఆరవేశారు. ఒక భక్తుడు భగవన్నామాన్ని జపిస్తూ బట్టల్ని తొక్కుకుంటూ వెళ్ళాడు. అది చూసిన చాకలివాళ్ళు కోపంతో అతన్ని కొట్టడానికి పరుగెత్తి వచ్చారు. అప్పుడు హఠాత్తుగా తన భక్తుణ్ణి రక్షించడానికి వైకుంఠం నుంచి మహావిష్ణువు బయలు దేరాడు. అయితే బయలుదేరిన కొద్దిసేపటికే తిరిగి వచ్చిన మహావిష్ణువుని చూసి లక్ష్మీదేవి 'హడావిడిగా వెళ్ళిన వారు తిరిగి వెంటనే ఎందుకు వచ్చేశారు?' అని ప్రశ్నించింది. అందుకు విష్ణువు 'నా భక్తుడు నామ సంకీర్తనం చేస్తూ చాకలి ఆరవేసిన బట్టలను తొక్కాడు. అందుకు వారు అతన్ని కొట్టడానికి సిద్ధమయ్యారు. ఆపదలో ఉన్న నా భక్తుణ్ణి రక్షించడానికి వెళ్ళాను. అయితే అంతలోనే ఆ భక్తుడు వాళ్ళపై ఎదురుదాడి చేశాడు. స్వీయ రక్షణ కోసం సిద్ధమైన అతడికి నా అవసరం ఇక లేదని తెలిసి నేను తిరిగి వచ్చాను' అని లక్ష్మీదేవితో అన్నాడు. దీన్ని బట్టి భగవంతునిపై మనకున్న విశ్వాసం ఎలాంటిదో ఒకసారి ఆలోచించుకోవాలి.

3. ఇష్టనిష్ఠ : ఇష్టదైవం పట్ల ఏకనిష్ఠ కలిగివుంటే మనకు ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వాటిని తట్టుకొనే శక్తి లభిస్తుంది. ఇష్టనిష్ఠ లేనివాడు ఎలా ఉంటాడో తెలియజేస్తూ శ్రీరామకృష్ణులు ఒక కథ చెప్పారు :

"ఒకడు కొండ మీద గుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. ఒకరోజు పెద్ద గాలివాన వచ్చింది. గాలివాన వల్ల తన గుడిసె ఎగిరిపోకుండా రక్షించమని అతడు వాయుదేవుణ్ణి 'ఓ వాయుదేవా! నా గుడిసెను రక్షించు' అని ప్రార్థించాడు. కానీ గాలివాన ఆగలేదు. అప్పుడు వాయుదేవుని కుమారుడు హనుమంతుడు కాబట్టి తన గుడిసెను రక్షించమని హనుమంతుణ్ణి ప్రార్థించాడు. కానీ గాలివాన ఆగలేదు. అప్పుడు హనుమంతుడు శ్రీరాముని భక్తుడు కాబట్టి తన గుడిసెను రక్షించమని శ్రీరాముణ్ణి ప్రార్థించాడు. గాలివాన ఇంకా ఉధృతమైంది. గుడిసె కూలిపోయింది. ఇక అతడు చేసేదేమీలేక 'ఛీ ముష్టి కొంప పోతే పోయింది' అంటూ దేవుణ్ణి నిందిస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు".

మనం కూడా కష్టాలు ఎదురైనప్పుడు ఇష్టనిష్ఠ కోల్పోయి భగవంతుణ్ణి నిందిస్తాం. ఇష్టదైవంపై నిష్ఠ లేకుండా రోజుకో




దేవుణ్ణి మార్చుకుంటూ పోతే ఎలాంటి ప్రగతినీ సాధించలేం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మనస్సు, మాట ఒకటై ఉండాలని శ్రీరామకృష్ణులు చెప్పారు. కాబట్టి మనస్సులో ఒకలా భావిస్తూ, బాహ్యంగా మరోలా ప్రవర్తించినంత కాలం నిజమైన భక్తులం కాలేం. కపాల మోచనుడు అని శ్రీశారదాదేవి పేర్కొన్న ఆ శ్రీరామకృష్ణుల గురించి మనం నిజంగా ఏమనుకుంటున్నాం? శ్రీరామకృష్ణులను మన ప్రాపంచిక కోరికలు తీర్చే దేవునిగా భావిస్తున్నామా! మన మనస్సులో ఏ భావాలు ఉన్నాయో, ఎంత భక్తి ఉందో మనల్ని మనం పరీక్షించుకోవాలి. మనం భక్తులమని చెప్పుకునే ముందర 'మనస్సు, మాట ఒక్కటి కావాలి' అన్న శ్రీరామకృష్ణుల బోధను ఆచరించాలి. అప్పుడే 'భావంలోనూ బాహ్యమునందునా' ఒకేలా వ్యవహరించగలం. శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులం కాగలం. ❖

చైతన్యులుగా శ్రీరామకృష్ణులు

- స్వామి జ్ఞానదానంద



ఒకసారి శ్రీరామకృష్ణులు హరిసభ సమావేశంలో పాల్గొన్నారు. హరిసభలో భక్తులు ఒక ఆసనాన్ని పీఠం మీద పరచి, చైతన్యదేవులు దాని మీద ఆసీనులై ఉన్నట్లు ఎంచి, భాగవతాదుల పఠనం, ఆరాధన మొదలైనవి నిర్వహించేవారు. ఆ ఆసనాన్ని 'శ్రీచైతన్యుల ఆసనం' అని పేర్కొనేవారు. భక్తి ప్రపత్తులతో అందరూ ఆ ఆసనం ముందు ప్రణామాలు చేసేవారు. ఆ ఆసనం మీద కూర్చోవడానికి ఎవరినీ అనుమతించే వారు కారు. శ్రీచైతన్యులు ఆ ఆసనం మీద కూర్చొని భాగవత పారాయణం వింటారని భక్తులు భావించేవారు.

ఆసనం ముందు భాగవత పారాయణం జరుగు తున్నది. భాగవత వచనామృతాన్ని గ్రోలుతూ శ్రీరామకృష్ణులు మైమరచిపోయారు. ఆ స్థితిలో హఠాత్తుగా ఆయన 'శ్రీచైతన్యుల ఆసనం' వైపుగా పరుగెత్తి, దాని మీద నిలబడి, ప్రగాఢ సమాధిలో నిమగ్నులైపోయారు. దేదీప్య మానంగా ప్రకాశిస్తూ ఉన్న ఆయన ముఖారవిందాన అసాధారణమైన ప్రేమాస్పద దరహాసం వెల్లివిరిసింది; చిత్తరువులలో కానవచ్చే చైతన్యుల భంగిమలో ఆయన నిలబడిన తీరుతెన్నులను చూసి భక్తులు తమ హృదయాంత రాళాలలో భావముఖ స్థితిలోని శ్రీరామకృష్ణులు చైతన్య దేవులతో తాదాత్మ్యం చెందినట్లు భావించసాగారు. భాగవతం పారాయణం చేస్తున్న వ్యక్తి పారాయణం చేయడం ఆపి, ఆయన వంకే నిశ్చలంగా చూస్తూ ఉండిపోయాడు. శ్రోతలు గురుదేవుల భావసమాధి స్థితిని అవగతం చేసుకోలేక పోయినప్పటికీ, ఏదో ఒక అవ్యక్తమైన విస్మయంతో పరవశులై నిశ్చలంగా ఉండిపోయారు. గురుదేవుల శక్తిమంతమైన ఆధ్యాత్మిక భావ ప్రవాహంలో అందరూ అనిర్వచనీయ పరమానందం అనుభవించసాగారు. అందరూ బిగ్గరగా 'హరిబోల్' అంటూ హరిసంకీర్తన ప్రారంభించారు.

క్రమంగా ఈ వార్త ఆ నోట ఈ నోట పడి వైష్ణవ సముదాయం అంతటా వ్యాపించింది. భగవాన్‌దాస్ బాబాజీ (వైష్ణవ సముదాయ ఆధ్యాత్మిక నేత) చెవిన కూడా పడింది.

తన అభీష్టదేవత ఆసనం మీద ఎవరో అనామకుడైన రామకృష్ణుడు నిలబడి అపవిత్రం చేశాడని వినగానే ఆ వైష్ణవ సాధుపుంగవుడు క్రుద్ధుడయ్యాడు.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల తరువాత హృదయ్, మథుర్‌లతో పాటు గురుదేవులు, భగవాన్‌దాస్ బాబాజీని కలుసుకోవడానికి కాల్నా వెళ్ళారు. ఒక వైష్ణవ సాధువు క్రమశిక్షణా రాహిత్యం పట్ల బాబాజీ చర్య తీసుకొంటు న్నప్పుడు గురుదేవులు లోపలికి వచ్చారు. అప్పుడు బాబాజీ ఇలా అంటున్నారు: "అతడి జపమాలను గుంజుకొని వైష్ణవ సముదాయం నుంచి అతణ్ణి వెలివేయండి."

అప్పుడు బాబాజీతో గురుదేవులు ఇలా అన్నారు: "లోకులకు బోధించగలనని నువ్వు అనుకొంటున్నావా? జపమాలను త్రిప్పడమో లేక త్రిప్పకపోవడమో నువ్వే నిర్ణయించగలనని భావిస్తున్నావా? నిన్ను ఎవరు గురువును చేశారు? భగవంతుని ఆదేశం లేకుండా నువ్వు లోకానికి బోధించగలవా?" ఆయన ఇలా మందలిస్తూ ఉండగా ముసుగులా ఆయన శరీరాన్ని కప్పివేసిన వస్త్రం జారి నేల మీద పడిపోయింది. గురుదేవుల ముఖారవిందం అపూర్వమైన దివ్య తేజస్సుతో ప్రకాశించసాగింది. ఎవరితో, ఏం మాట్లాడుతున్నాననే ఎరుకే లేనంత పారవశ్య స్థితిలో ఆయన అప్పుడు ఉన్నారు. ఆ నాలుగు మాటలూ పలుకుతూ ఉండగానే, భావోద్వేగమగ్నులై గురుదేవులు సమాధి స్థితులయ్యారు.

గురుదేవుల శక్తిమంతమైన వచనాలతో బాబాజీలోని అంతర్దృష్టి జాగృతమైంది. అతడు తన దోషాలను గుర్తించి నిగర్వి, వినమ్రుడు అయ్యాడు. భగవాన్‌దాస్ గురుదేవులకు అభివాదం చేసి "మీ అనుగ్రహం వల్ల మిమ్మల్ని చైతన్య మహాప్రభువుగా తెలుసుకొన్నాను"అని అన్నాడు. ❖

(ఫిబ్రవరి 28, ఆదివారం శ్రీ చైతన్య మహాప్రభువు జయంతి)



పార్వతి పరమేశ్వరుణ్ణి పూజించిన రాత్రి

– శ్రీమతి గరిమెళ్ళ లక్ష్మి

(ఫిబ్రవరి 12, శుక్రవారం మహా శివరాత్రి)

దేవేంద్రుడు ఒకమారు ఏనుగు మీద వెళుతుండగా దుర్వాస మహర్షి ఎదురయ్యాడు. దుర్వాసుని చేతిలో పరమశివుణ్ణి పూజించిన కలువపూల దండ ఉంది. ఆయన దాన్ని ఇంద్రుడికి ఇచ్చాడు. ఇంద్రుడు ఆ హారాన్ని ఏనుగు మెడలో వేశాడు. ఆ ఏనుగు దాన్ని తీసి కింద పడేసి కాళ్ళతో తొక్కింది. మహర్షికి కోపం వచ్చి, ఇంద్రుడి సంపద అంతా నశించి పోవాలని శాపం పెట్టాడు.

ఇది జరిగిన కొంత కాలానికే బలిచక్రవర్తి మొదలైన రాక్షసులు ఇంద్రుణ్ణీ, ఇతర దేవతలనూ ఓడించి స్వర్గాన్ని ఆక్రమించారు. అప్పుడు ఇంద్రుడు, బ్రహ్మదేవుడు, ఇతర దేవతలు విష్ణుమూర్తిని స్తోత్రం చేసి, తమను రక్షించాల్సిందిగా వేడుకొన్నారు. అప్పుడు ఆ పురుషోత్తముడు దేవతలను కొంతకాలం రాక్షసులతో స్నేహంగా ఉండాల్సిందిగా సలహా ఇచ్చాడు. అమృతం తాగిన వారికి మరణం ఉండదంటూ, అమృతం కోసం పాలసముద్రాన్ని మథించాల్సిందిగా చెప్పాడు. మందర పర్వతాన్ని కవ్వంగా చేసి, వాసుకిని కవ్వానికి తాడుగా చేసి, తన (విష్ణుమూర్తి) సహాయంతో దీక్షతో మథిస్తే ఫలితం ఉంటుందనీ, ముందుగా విషం పుడుతుందనీ, దాన్ని చూసి భయపడవద్దనీ చెప్పాడు. ఏ వస్తువైనా మంచిదైతే సంతోషపడవద్దు, చెడ్డదైతే కోపం తెచ్చుకోవద్దు అని చెబుతూ అచ్యుతుడు వెళ్ళిపోయాడు.

దేవతలు దానవులతో విరోధం మాని, స్నేహంగా ఉండసాగారు. పాల సముద్ర మథనం చేయడం వల్ల కలిగే ప్రయోజనం దేవతలు చెప్పగా దానవులు అందుకు అంగీకరించారు. శ్రీహరి చెప్పినట్లే మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకుని, కవ్వపు తాడుగా ఉండడానికి వాసుకిని ఒప్పించారు. దేవతలు వాసుకి తోక వైపు పట్టుకోగా, దానవులు తల వైపు పట్టుకున్నారు. సముద్ర మథనం ప్రారంభమైంది.

అయితే అడుగున కుదురు లేకపోవడం వల్ల మందర పర్వతం సరిగా నిలవలేదు; అది సముద్రంలో మునిగి పోసాగింది. ఆ స్థితిలో శ్రీమహావిష్ణువు కూర్మ రూపంలో సముద్రంలోకి ప్రవేశించి, మందరగిరిని వాసుకితో పాటు పైకి ఎత్తాడు. సముద్రాన్ని మథించే వారిలో ఒకడుగా ఉండీ తానే కుదురుగా (కూర్మ రూపంలో) ఉన్నాడు శ్రీహరి. దేవదానవులు సముద్రాన్ని మథిస్తుండగా కాలకూట విషం ఉద్భవించింది. దాన్ని చూసి వారంతా భయపడి, కవ్వపు తాటిని విడిచిపెట్టి చెల్లాచెదురయ్యారు. ఆ హాలాహలం ఈశ్వరుని మూడో కంటి అగ్నిలా, పెద్దపెద్ద జ్వాలలతో మూడు లోకాలలోనూ వ్యాపించ సాగింది.

అప్పుడు బ్రహ్మదేవుడు ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళి ఆ హాలాహలాన్ని స్వీకరించి, ప్రాణులన్నింటినీ రక్షించాల్సిందిగా వేడుకున్నాడు. వెంటనే ఆ దేవదేవుడు "ప్రాణులను రక్షించడం నా ధర్మం, గరళాన్ని స్వీకరిస్తాను" అని పార్వతితో చెప్పాడు. ఆ జగన్మాత "మీకు ఏది ఉచితమైనదిగా అనిపిస్తే అలా చెయ్యండి" అంది.

దేవతలందరూ జయజయ ధ్వానాలు చేస్తుండగా శివుడు హాలాహలాన్ని ఒక కడిగా చేసి, దాన్ని నేరేడు పండు మ్రింగినట్లు మ్రింగాడు. అయితే, తన ఉదరంలో ఉన్న లోకాలన్నీ నశిస్తాయని ఆ విషాన్ని కంఠంలోనే ఉంచుకుని 'నీలకంఠుడు' అయ్యాడాయన. మహాదేవుడు గరళాన్ని మింగినందుకు భయపడి, ఆ తాపం తగ్గాలని అమ్మవారు ఆ రోజు ఉపవాసం చేసి, ఆ రాత్రి జాగరం ఉండి నాలుగు యామాలలోనూ శివుడికి అభిషేకం, అర్చన చేసింది. ఆ తరువాత తాను ఆయనను పూజించిన ఆ రాత్రిని దేవమానవులు శివుడికి ప్రీతికరమైన రాత్రిగా స్వీకరించి పూజలు చెయ్యాలనీ, అలా చేసిన వారికి ఈశ్వరుడు సకల భోగభాగ్యాలనూ, ముక్తినీ ప్రసాదించాలనీ కోరింది జగన్మాత. శివుడు అందుకు "తథాస్తు" అన్నాడు. ఇదీ శివరాత్రి ప్రాముఖ్యం. ❖



పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -32

భగవంతుడిదే భారమన్న భక్తుడి కథ

స్వామి జపానంద కఠియావాడ్ (ప్రస్తుతం సౌరాష్ట్రం) యాత్రలో ఉండగా ఒక భక్తుడు ఆయనతో "కఠియావాడ్‌లో భక్తులు చాలా మంది ఉన్నారు. ఇక్కడ సన్న్యాసులు తక్కువ, భక్తులు ఎక్కువ కనిపిస్తారు. మీరు మీ యాత్రల సందర్భంలో అలాంటి భక్తులను కలిసే అవకాశాలు చాలా వస్తాయి" అని అన్నాడు. అందుకు స్వామి "మీరు చెప్పిన మాట నిజమే. మీకు తెలిసిన భక్తుల పేర్లు నాకు చెప్పండి. వారిలో కొంత మందినైనా నేను కలిసే ప్రయత్నాలు చేస్తాను" అన్నారు.

ఆ భక్తుడు కొంత మంది పేర్లు చెప్పాడు. అందులో ఒకరు జగజ్జీవన్‌రామ్. అతను అక్కడకు దగ్గరలోనే ఉన్న గ్రామంలో ఉంటాడు. మర్నాడు సన్న్యాసి అతని గ్రామం వెళ్ళారు. అది శీతాకాలం. బాగా చలిగా ఉంది. సన్న్యాసి ఆ గ్రామానికి చేరేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. భిక్షకు సమయమైంది. ఎవరినో అడిగి ఈ భక్తుడి ఇంటి తోవ తెలుసుకొని, ఇంటి ముంగిట్లో అడుగు పెట్టారు. అక్కడ ఆ ఇంటి యజమాని కాబోలు ముందు బల్ల మీద ఏదో పుస్తకం పెట్టుకుని చదువుతున్నాడు.

"నారాయణ హరి" అనే పలుకులు విని అతను తల ఎత్తి ద్వారం దగ్గర నిల్చుని ఉన్న సన్న్యాసిని చూసి వెంటనే ప్రణామం చేశాడు. తరువాత సన్న్యాసి చేతులు పట్టుకుని, "స్వామీజీ! రండి రండి! లోపలికి రండి. ఇవాళ ఎంత అదృష్టం" అంటూ లోపలకు తీసుకెళ్ళి తన పక్కనే మరొక ఆసనం పరిచి, స్వామీజీని కూర్చోమన్నాడు. ఎప్పటి నుంచో బాగా పరిచయం ఉన్నవాడిలా సన్న్యాసితో అతడు మాట్లాడాడు.

సన్న్యాసికి బాగా ఆకలిగా ఉంది. ఆ భక్తుడు మాత్రం ఏవో కబుర్లు చెబుతున్నాడు కాని సన్న్యాసిని భోజనం విషయం అడగడం లేదు. కనీసం తాగడానికి నీళ్ళు కూడా ఇవ్వలేదు. "స్వామీజీ నేను తులసీ రామాయణం చదువుతున్నాను. ఇందులో నాకు చాలా అంశాలు అర్థం కావడం లేదు. దయచేసి నాకు ఇందులోని అంశాలను వివరించండి" అన్నాడు. అప్పుడు సన్న్యాసి, రామాయణం తీసుకుని అతను చెప్పిన భాగం చదివి అర్థం చెప్పారు. అది భక్తుడికి ఎంతో నచ్చింది. అదయ్యాక ఇంకొకటి, ఇంకొకటి అంటూ అలా అర్థాలు చెప్పించుకుంటున్నాడు. అలా సమయం మధ్యాహ్నం మూడున్నర అయింది. భక్తుడు మాత్రం రామాయణం చదవడం, అర్థం చెప్పించుకోవడంలో మునిగిపోయి ఇతర విషయాలన్నీ మర్చిపోయినట్లున్నాడు. సన్న్యాసికి ఇంక ఆకలి కూడా మందగించింది.

అప్పుడే పక్క గదిలో నుంచి నలుగురైదుగురు స్త్రీలు అక్కడకు వచ్చారు. వాళ్ళతో కలిసి ఒక యువకుడు కూడా వచ్చాడు. "మీ కారణంగానే ఇవాళ అందరం ఆకలితో ఉండాల్సి వచ్చింది. ఇక మీతో కలిసి మేము ఉండలేము" అని వాళ్ళన్నారు. వాళ్ళు అలా అంటుంటే, ఆ మాటలు వింటూ ఆ భక్తాగ్రేసరుడు శాంతంగా, నిర్వికారంగా కూర్చున్నాడు. అతని ముఖకవళికల్లో కూడా మార్పు రాలేదు. అది చూసి సన్న్యాసి ఆశ్చర్యపోయారు.


అంతా విన్నాక అతను "ఇంక శాంతించండి. అందరం సాయంత్రం ప్రార్థన అయ్యాక మాట్లాడుకుందాం. స్వామీజీ నాకు ఇప్పుడు రామాయణం చెబుతున్నారు. పరమేశ్వరుడికి తెలియదా ఇవాళ ఇంట్లో ఏమీ లేదని! స్వామీజీని ఇక్కడకు పంపించిన ఆ భగవంతుడే ఏదో ఏర్పాటు చేసి ఉంటాడు. భగవంతుడి మీద నమ్మకం ఉంచండి"అని అన్నాడు.

అప్పుడు స్వామీజీ వైపు తిరిగి ఆ యువకుడు "చూడండి స్వామీజీ! ఇవాళ మేమందరం పస్తే! ఇంట్లో పొయ్యి కూడా అంటించలేదు. పిల్లలకు తిండి లేదు. ఇవాళ ఉదయమే ఇరవై మంది సన్న్యాసులు వెళ్ళారు. వాళ్ళందరికీ ఈయన పదిహేను రోజులు ఆతిథ్యం ఇచ్చారు. ప్రతి రోజూ పంచభక్ష్య పరమాన్నాలు. ఇంట్లో ఉన్నదంతా పెట్టేశాక పక్కవాళ్ళ దగ్గర అరువు తీసుకుని పెట్టేవారు తప్ప వాళ్ళను సాగనంపలేదు. ఇంక నేను ఉండబట్టలేక వాళ్ళకు ఒక నమస్కారం పెట్టి వెళ్ళిపొమ్మన్నాను. అందుకే ఇవాళ మేమందరం ఉపవాసం ఉండి అయినా సరే ఈయన చేస్తున్నది బాగా లేదనీ, శక్తికి మించి అందరికీ ఆతిథ్యం ఇవ్వడం కష్టమని తెలియచెయ్యాలని ఇప్పుడు వచ్చాం" అన్నాడు.

అదంతా విన్న ఆ భక్తుడు "ఇప్పుడు ఇవన్నీ మాట్లాడవద్దు. ఇంటికి వచ్చిన అతిథిని నేను ఆదరిస్తాను. సరే మీరందరూ ఇక వెళ్ళండి. నేను రామాయణం వింటాను" అన్నాడు.

అందరూ పక్కగదిలోకి వెళ్ళిపోయారు. సన్న్యాసి మళ్ళీ రామాయణం ప్రారంభించారు. అప్పటికి సన్న్యాసికి అర్థమైంది సాయంత్రం అవుతున్నా భక్తుడు భిక్ష ఎందుకివ్వలేదో!

మళ్ళీ రామాయణం చదవడం ప్రారంభించారు. అలా ఆ భక్తుడు రామాయణం చెప్పించుకుంటున్నాడు. ఇంతలో సాయంకాలం అయింది. "జగజ్జీవన్ రామ్ గారి ఇల్లు ఇదేనా?" అన్న మాట విని భక్తుడు గుమ్మం వైపు చూశాడు. అక్కడ చేతిలో ఉత్తరం ఒకటి పట్టుకుని ఒక రైతు నిల్చొని ఉన్నాడు. "రా బాబూ, రా! ఎవరు నువ్వు? ఎక్కడ నుంచి వచ్చావు? లోపలకు వచ్చి కూర్చో" అని కుశలప్రశ్నలు వేసి పిలిచారు. అతని చేతిలో ఉన్న ఉత్తరం అందుకొని చదివి, వెంటనే ఇంట్లోని అందరినీ త్వరగా రమ్మని పిలిచారు. యువకుడైన తన తమ్ముడికి ఉత్తరం ఇచ్చి, పైకి గట్టిగా చదవమన్నాడు. అందులో ఈ విధంగా ఉంది:



"అయ్యా! తొమ్మిది, పదేళ్ళ క్రితం మీరు శివరాత్రికి ఒక భక్తమండలితో కలిసి జునాగఢ్ వచ్చారు. అప్పట్లో నేను చాలా బీదవాణ్ణి. తగిన పైకం ఇవ్వలేకపోవడంతో నాకు ఎక్కడా ఎవరూ ఆశ్రయమివ్వలేదు. మీరు ఒక్కరే నన్ను ఆదరించి తమతో కలిసి ఉండడానికి సమ్మతించారు. మీ భక్తమండలిలో సభ్యుల్ని ఆదరించినట్లే నన్ను కూడా ఆదరించారు. ఆ రోజు నేను ఆ భోళాశంకరుణ్ణి ప్రార్థించాను. ఎప్పటికైనా నేను ఈ బీదరికం నుంచి బయటపడి డబ్బు వెనకేసుకోగలిగితే, కొంత పైకం ఈ మహానుభావుడికి పంపి, కృతజ్ఞత తెలుపుకుంటాను అని! ఈ రోజు ఈశ్వరుని దయ వల్ల నా దగ్గర కొంత భూమి ఉంది. రెండేళ్ళ నుంచి పంట కూడా బాగా పండింది. అందుకని ఇవాళ నేను 10 మణుగుల గోధుమలు మీకు పంపిస్తున్నాను. దయచేసి స్వీకరించండి."

ఉత్తరంలోని ఆ మాటలు విని అందరి ముఖాల్లో సంతోషం కనిపించింది. భక్తుడు "చూశారా! మన ఇంట్లో ఏమీ లేదని తెలిసిన భగవంతుడు ఏదో ఒక ఏర్పాటు చేస్తాడని అన్నాను కదా! ఇక అందరూ వెళ్ళి వంట ఏర్పాట్లు చూడండి" అని ఇంట్లో వాళ్ళకి చెప్పాడు. కుటుంబ సభ్యులందరూ లోపలికి వెళ్ళిపోయారు. సన్న్యాసి మనస్సులోనే ఆ భక్తునికి నమస్కారం చేశారు.

దీపాలు పెట్టే వేళ అయింది. ఇలవేల్పు అయిన శ్రీరామచంద్రుడికి పూజ, భజనలు చేశాక అందరూ మళ్ళీ లోపలకి వెళ్ళిపోతూఉంటే అందరినీ పిలిచి ఆ భక్తుడు "ఇందాక మీరందరూ ఏదో అంటున్నారు. ఇప్పుడు చెప్పండి విషయమేమిటో!" అన్నాడు. ఆ మాటకు అందరూ సిగ్గుపడుతూ, మౌనంగా కూర్చున్నారు.

"సాయంత్రం ప్రార్థన తరువాత మాట్లాడుకుందామని అప్పుడు నేను అన్నాను కదా! ఇప్పుడు చెప్పండి ఏం చెప్పదల్చుకున్నారో! నేను ఎవరికీ కాదు, లేదు అనలేను. అది నిజంగా నాకున్న చెడ్డ అలవాటే! ఇది మీ అందరికీ కష్టంగా ఉంది. ముందు ముందు ఇలా అవకుండా ఉండడానికి ఏదో ఒక ఏర్పాటు చేసుకోవాలి. పొలాలు, పంట అంతా మీరే చూసుకుంటున్నారు కదా! మీ వంతుకు వచ్చిన పంట మీరు వేరుగా పెట్టుకోండి. అప్పుడు మీకు ఈ విధమైన ఇబ్బంది ఎదురవదు. అదే కదా మీకు కావాల్సింది! ఇవాల్టి నుంచి నా భాగంలో ఏది వస్తే అది ఈ గదిలో పెట్టండి. మీరందరూ మీ మీ భాగాలు మీరు జాగ్రత్త చేసుకోండి" అన్నాడు ఆ భక్తుడు. అతని మాటలు విని అతని భార్య, కూతురు, అక్కచెల్లెలు – ఇలా ఇంట్లోని ఆడవాళ్ళందరూ ఏడుపు ప్రారంభించారు.

"ఎందుకు ఏడుస్తారు? ఒకే ఇంట్లో ఉందాం. పంట మాత్రం పంచుకుందాం. మీరందరూ నిశ్చింతగా ఉండండి. ఇక నుంచి మిమ్మల్ని కష్టపెట్టను" అన్నాడు అతను. అందరూ లోపలకు వెళ్ళిపోయారు. సన్న్యాసి విస్మయంగా చూస్తూ ఉండిపోయారు. ఐదు నిమిషాలలో పంపకాలు అయిపోయాయి. అసలైన భక్తుడు జగజ్జీవన్‌రామ్ గొప్పదనం అది. ఆ తరువాత ఆ కుటుంబ సభ్యులందరూ కలసి సన్న్యాసిని పదిహేను రోజులు ఇంట్లో ఉంచుకున్నారు. జగజ్జీవన్‌రామ్ గారైతే రామాయణం అంతా అర్థం చెప్పడం అయిన తరువాతే సన్న్యాసిని అక్కడ నుంచి వెళ్ళనిచ్చారు. ❖

అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

దేవీ వైభవం



ప్రవచనం: శ్రీ సామవేదం షణ్ముఖశర్మ   విలేఖనం: శ్రీమతి ఎన్. శేషు

(...గత సంచిక తరువాయి)

వ్యాస భగవానుడు, జగదంబిక తత్త్వాన్ని జనమేజయుడికి ఇలా తెలిపారు: "భక్తితో అమ్మను స్మరించినా, పూజించినా, ధ్యానించినా, కీర్తించినా వారికి కావల్సినవన్నీ అమ్మ ప్రసాదిస్తుంది". సృష్టిలో ఆశ్రయం, ఆసక్తి అనే రెండు గుణాలుంటాయి. ఆశ్రయం అంటే ఏదైనా అవసరం కోసం ఒకరిని ఆశ్రయిస్తాం. ఆసక్తి అంటే ప్రీతి. భక్తిలో ఆశ్రయం, ఆసక్తి ఒకటే!

వ్యాసదేవుడు ఇక్కడ మరొక మాట చెప్పాడు – "మూర్ఖులు, దరిద్రులు, రోగులు... వీళ్ళు గత జన్మలో అమ్మను ఆరాధించ లేదు. అందుకే ఈ దుఃస్థితిని పొందారు. అనేక జన్మల ఆరాధన ఫలితంగా మహానుభావులు వచ్చారు. అమ్మను ఆరాధించిన వారికి ఇహమూ పరమూ లభిస్తాయి తప్ప మరొక గతి లేదు." అందుకే జగదంబిక భోగదాయిని, యోగదాయిని, మోక్షదాయిని. మన చేత ఆరాధన పొందడానికి ఆ జగదంబిక ఎన్నో రూపాలు ధరించి సిద్ధంగా ఉంది; ఆలస్యం మనదే. అమ్మ అనుగ్రహంలో ఆలస్యం ఏమీ లేదు. అమ్మ ధరించిన అనేక రూపాలను (అమ్మ నామాలను) దేవీ భాగవతం లాంటి గ్రంథాలు వివరిస్తాయి.

అమ్మ పేరేమిటి అని ప్రశ్నిస్తే లక్ష్మీ అష్టోత్తరంలోని మొదటి పేరు చెప్పుకోవచ్చు. అది "ప్రకృతిం". ఈ జగత్తంతా ఆవిర్భవించడానికి ఏది మూల వస్తువో అది ప్రకృతి. లోకంలో మనం ఒక మూల వస్తువు నుండి మరొక పదార్థాన్ని తయారు చేస్తాం. తయారైన పదార్థం పేరు వికృతి. వికృతి అంటే పరిణామం ద్వారా వచ్చిన వస్తువు. ఈ పరిణామాలన్నిటికీ ఏది మూల వస్తువో అది ప్రకృతి. దాని నుండి తయారైన పంచభూతాలూ, వగైరా అన్నీ వికృతులు. అది వేరు, ఇది వేరా అంటే – అదే ఇదైంది. ఒక దూది కండె తీసుకొని, ఒక మహా వస్త్రాన్ని నేసినట్లుగా జగన్మాత తన ప్రకృతి శక్తిగా ఆవిర్భవించి, ఈ అనంతమైన విశ్వాన్ని కృతిగా రచించింది; అదే వికృతి అని చెప్పబడుతుంది. పురుషుడు అంటే పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి చెప్పేది. ఆయన శక్తి ప్రకృతి.

ఈ జగత్తంతా ఆ తల్లే వ్యాపించి ప్రసరిస్తేనే సృష్టి చైతన్యవంతమైంది, లేకపోతే చైతన్యమనేదే లేదు. చైతన్యమే అమ్మ రూపం. అందుకే సర్వచైతన్యరూపాం అన్నది మనం మరచిపోకూడదు. సర్వ చైతన్యరూపిణి అయిన ఆ జగదంబికే సృష్టికి పూర్వం ఉంది. సృష్టికి ప్రధానంగా ఉంది, సృష్టి అంతా వ్యాపించి ఉంది. ఇది ప్రకృతి అనే శబ్దానికి ఉన్న విశేషం.

ఆ జగదంబిక ఈ సృష్టి కోసం వివిధ రూపాలు ధరించింది. అందులో ముఖ్యమైనవి ఐదు. అవి అమ్మవారి పూర్ణ స్వరూపాలు. అవతారాల్లో పూర్ణావతారాలు అన్నట్లే అమ్మవారు ధరించిన ప్రకృతి ఆకృతులలో ఇవి పూర్ణ స్వరూపాలు. అవి – దుర్గా, రాధా, లక్ష్మీ, సరస్వతీ, సావిత్రీ– ఈ ఐదు రూపాలనూ ఉపాసించే వాళ్ళు వివిధ సంప్రదాయాలలో భారతదేశమంతటా ఉన్నారు. ఇందులో ఏ రూపాన్ని ఆరాధించినా పూర్ణ శక్తిని ఆరాధిస్తున్నట్లే. మన కన్నతల్లి మనల్ని అనేక విధాలుగా పోషిస్తుంది. అన్నీ చేసేదీ, చేయించేదీ ఆ తల్లే. సర్వ సమర్థురాలు ఆ తల్లి. ఏ రూపంలో ఉన్నప్పుడు తల్లిని పిలచినా ఆ తల్లిలో అన్ని సమర్థతలూ ఉన్నాయి. అందుకే లక్ష్మి వేరు, దుర్గ వేరు, సరస్వతి వేరు అనుకోకూడదు. "ఏకా ఏకా" అని అన్నీ కలిపి ఒకే అమ్మ. ఆ ఏకా అయిన తల్లిని ఏ రూపంతో ఆరాధించినా ఆ పరతత్త్వం మనల్ని కాపాడుతుంది.

'నారాయణీ విష్ణుమాయా పూర్ణ బ్రహ్మ స్వరూపిణి' అన్నారు. అమ్మకు 'నారాయణి' అని పేరుంది. సర్వజగద్వ్యాపిని ఆ తల్లి. దేవతలందరూ అమ్మవారిని "సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్ర్యంబకే గౌరీ నారాయణి నమోస్తుతే" అని స్తోత్రం చేస్తారు. హిమవత్పర్వత ప్రాంతం వద్ద గౌరీదేవిని చూసి దేవతలు చేసిన స్తోత్రంలో "నారాయణి నమోస్తుతే" అని వస్తుంది. అలాగే శుంభ నిశుంభ సంహారం అయిన తరువాత ఆ జగజ్జనని నారాయణీ స్వరూపంగా సాక్షాత్కరించి, వారందరినీ అనుగ్రహించిన విషయం దేవీమాహాత్మ్యం చెబుతోంది. నారాయణి అన్న శబ్దానికి అర్థం ఏమిటి అని చూస్తే... లలితాసహస్రంలో "నారాయణీ నాదరూపా" అనే నామం వస్తుంది. నారము అంటే జీవసమూహం అని అర్థం. "నరాణాం సమూహం

నారం". ఆ నారమునకు అయనం అంటే ఆశ్రయం; సర్వ జీవకోటికీ ఏది ఆశ్రయశక్తో ఆ ఆశ్రయశక్తే నారాయణి. అదే శ్రీ అనే శబ్దానికి అర్థం. "త్వామాశ్రితానాం న విపన్నరాణాం త్వామాశ్రితాయాశ్రయతాం ప్రయాంతే". సర్వ జీవులకూ ఆశ్రయ శక్తి అయిన చైతన్య స్వరూపిణి నారాయణి.

'బ్రహ్మాది దేవైః మునిభిః మనుభిః పూజితా స్తుతా' – బ్రహ్మాది దేవతల చేత, మునుల చేత, మనువుల చేత పూజితురాలవుతున్నది. ఇక్కడ మనువులచేత అనగానే మన్వంతరాలకు అధిపతులైన మనువులే కాకుండా 'మనుభిః' – అంటే అన్ని మంత్రాలతో అని అర్థం. "సర్వమంత్రారాధ్యా జగదంబిక సర్వమంత్ర స్వరూపిణి" జగదంబిక! అందుకే, "సర్వ మంత్రాత్మికే, సర్వయంత్రాత్మికే సర్వతంత్రాత్మికే సర్వరూపే హే జగన్మాతృకే" అన్నారు కాళిదాసు మహాకవి. "సా శర్వరూపా సనాతనీ..." – ఆమె శర్వరూప శివ స్వరూపిణి. అంటే శివుడు ఏ రూపం ధరిస్తే ఈమె దానికనుగుణంగా రూపం ధరిస్తుంది. శర్వుడు అంటే ప్రళయకారకుడు అని అర్థం; ఆ ప్రళయకారకుడైన పరమేశ్వరుని యొక్క స్వరూపిణి ఈవిడ. అలాగే, 'సనాతని'– ఎప్పటిదీవిడ అంటే చాలపెద్దమ్మ అన్నారు పోతన గారు.



"ధర్మ సత్యా పుణ్యకీర్తిర్యశోమంగళ ప్రదాయినీ" అమ్మవారిని ఆరాధించడం వలన ధర్మం, సత్యం, పుణ్యం లభిస్తాయి. పుణ్యం అంటే సుఖం అనుకుంటాం కానీ "పుణ్యం ఫలం సుఖం". పవిత్ర కర్మవల్ల సుఖం వస్తుంది. అందరికీ సుఖం కావాలి. కానీ పుణ్యం చెయ్యరు. పాప ఫలం ఎవరికీ అక్కర్లేదు, కానీ చేసేది మాత్రం పాపమే.

ఆ జగదంబకు 'పుణ్యాపుణ్య ఫలప్రదా" అనే నామం కూడా ఉన్నది. ఆ తల్లి మనకి పవిత్ర కర్మలు చేసే బుద్ధి పుట్టిస్తుంది, కొందరికి ఆ బుద్ధి ఉంటుంది, కానీ అవకాశం ఉండదు. అమ్మని ఆశ్రయిస్తే అవి చేసే అవకాశం ఇస్తుంది. సంకల్ప స్థాయి నుండి ఫలస్థాయి వరకూ పుణ్యం యొక్క సర్వ అవస్థలూ కూడా అమ్మే అందచేస్తుంది కనుక పుణ్యదాయిని. ఆ తరువాత కీర్తిదాయిని, మంగళదాయిని. మంగళమే అమ్మయొక్క స్వరూపం. అమ్మని ఆశ్రయించిన వారికి అంతా మంగళమే జరుగుతుంది.

మన ఋషులు అనేక మహామంత్రాలు మనకు అందించారు. అలాంటి గొప్ప మంత్రాలలో "సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే, శరణ్యే త్ర్యంబకే గౌరీ నారాయణి నమోస్తుతే" అనేది ఒకటి. దీనిని మంత్రంగా జపిస్తే అత్యద్భుతమైన ఫలితాలు లభిస్తాయి. సప్తశతి (దేవీ మాహాత్మ్యం) అనే కల్పవృక్షాన్ని కుదిపితే రాలిన అమృతఫలం ఈ శ్లోకం. "యశోమంగళదాయిని సుఖ మోక్ష హర్ష దాత్రి శోకార్తి దుఃఖ నాశిని". "సుఖ మోక్ష హర్ష" అని మూడు శబ్దములు చెప్తున్నారు. సుఖాలు (ఐహికమైన సుఖాలన్నీ), శుభాలు అందచేస్తుంది. మోక్షం అంటే దుఃఖాల నుండి విడుదల కలిగించే జ్ఞానం అని అర్థం. హర్ష అంటే ఆనందస్వరూపిణి. సచ్చిదానంద స్వరూపిణి కనుక సత్ చిత్ ఆనందమైన బ్రహ్మానంద స్థితిని అమ్మ ఇస్తుంది. అమ్మ ఇచ్చే ఆనందం ముందు ఈ లౌకికానందాలేవీ పనికిరావు. ఇవన్నీ దుఃఖోపశమనాలే తప్ప ఆనందములు అనలేం. అసలు శాశ్వతమైనది ఏది అంటే ఆత్మ స్వరూపిణి అయిన అమ్మ యొక్క పద ప్రాప్తియే ఆనందం. ఆ తల్లి వద్ద లభించే ఆనందం ఎలాంటిది అంటే "స్వాత్మానంద లవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః" – ఆ దివ్యమైన ఆత్మానందం వద్ద బ్రహ్మలోకం వరకూ ఉన్న ఆనందాలన్నీ అల్పమైనవి అని భావం.

అమ్మ కృపవల్ల... అమ్మ దివ్య చరణ సాన్నిధ్యం వల్ల లభించే ఆనందానుభవం వచ్చిన తరువాత ఈ జగదను భవాలన్నీ వృథా అని తెలుస్తుంది. అది ప్రేమజనిత వైరాగ్యం. సాధన ద్వారా అమ్మని ధ్యానించుతున్నకొద్దీ ఇవి ఎంత తుచ్ఛములో తెలుస్తాయి. అది లభిస్తే ఇంక వీటి మీదకి మనస్సుపోదు. "లోకయాత్రా విధాయినీ" అయిన జగదంబిక సుఖాలు మొదలైనవి ఇచ్చినా లోకయాత్ర వరకే. ఆ స్థితిని జగదంబిక అందజేస్తుంది. అది అందుకోవాలంటే అహంకారం విడిచిపెట్టి అమ్మ చరణాలే గతి అనుకోవడం ఒక్కటే మార్గం. లోకంలో ఒక పని సాధించాలంటే ఎందరికో ఎంతో ఇవ్వాల్సి వస్తుంది. ఎంతో శక్తి ధారపొయ్యాల్సి వస్తుంది. కానీ అమ్మ దగ్గర ఏమీ ధార పొయ్యక్కర్లేదు. మన అహంకారం ధారపోస్తే చాలు, అమ్మని పొందడం చాలా సులభం. ❖ **(సశేషం)**



త్యాగేశ్వర హే నరవర!

జగజ్జనని అందరికీ దర్శనం ఇవ్వడానికి సిద్ధంగానే ఉందనీ, కానీ ఆమెను కోరుకునేవారే లేరనీ, జనులు అల్ప విషయాలనే కాంక్షిస్తారనీ, విషయ తుల్యమేగాని మాతృచరణాసక్తి వారికి లేదనీ, సర్వాత్మనా అన్యాన్ని అపేక్షించక అమ్మ దర్శనాన్ని కోరుకునే పక్షంలో మరుక్షణంలోనే ప్రాప్తిస్తుందనీ శ్రీరామకృష్ణులు గ్రహించారు.

అతడు ఈ ఐహిక విషయాలను త్యజించసాగాడు. ధనాన్ని తాకనని ప్రతినబూనాడు. ఈ ప్రతిన అతడితో తాదాత్మ్యం పొందింది. ఇదొక గొప్పమహిమగా తోచవచ్చునుగాని, కాలాంతరంలో కూడా నేను నాణేన్ని తగిలిస్తే సుషుప్తిలోని అతడి చెయ్యి కొంకర్లు తిరిగి శరీరానికి పక్షవాతం సోకినట్లు అయింది. కామం మరొక శత్రువని అతడు గ్రహించాడు. కామకాంచనాలే జగజ్జనని దర్శనానికి ప్రతిబంధకాలుగా ఉన్నాయని అతడు తలచాడు. “ఈ జగత్తు యావత్తు జగజ్జనని అభివ్యక్తీకరణే. ప్రతి స్త్రీ జగజ్జనని ప్రతిరూపమే, అటువంటప్పుడు స్త్రీని కామభావంతో ఎలా చూడగలను?” అని అతడి భావన. ప్రతి స్త్రీనీ తల్లిగా భావించి, వారందరిలోనూ జగజ్జననిని తప్ప మరి ఎవరినీ చూడరాదనే స్థితిని సంతరించుకోగోరాడు. దీనికి అతడి జీవితం అద్దంపట్టింది. ప్రతి స్త్రీ పట్ల దివ్యమాతృత్వ భావన కలిగి ఉండడం శ్రీరామకృష్ణులలో ప్రత్యక్షంగా మేం చూశాం.

కాలాంతరంలో శ్రీరామకృష్ణులు నాతో ఇలా చెప్పారు: “నాయనా! ఒక గదిలో బంగారు కాసుల సంచీ ఉందనుకో. ప్రక్క గదిలో ఒక దొంగ ఉన్నాడు. ఆ దొంగ నిద్రపోగలడా? నిద్రపోలేడు. ఆ గదిలోకి ఎలాగైనా ప్రవేశించి ఆ బంగారాన్ని అపహరించాలని అతడి మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తుంది. అలాగే ఈ నామరూపాత్మకమైన లోకానికి ఆవల పరతత్త్వం ఒకటి ఉందనీ, భగవంతుడనే వాడు ఒకడు ఉన్నాడనీ, అతడు అమృత స్వరూపుడనీ, ఆనంద స్వరూపుడనీ, విషయ భోగాలన్నీ ఆ ఆనందంతో పోలిస్తే అత్యల్పమనీ గ్రహించిన వ్యక్తి దానిని పొందడానికి ప్రయత్నం చేయకుండా ఉండలేడు. ఆ వ్యాకులతతో అతడు పిచ్చివాడవుతాడు”.

భగవంతుణ్ణి దర్శించాలనే వ్యాకులత శ్రీరామకృష్ణులలో కలిగింది. కాళికాలయంలో ఆయన నిర్వర్తించే అసాధారణ పూజా విధానాన్ని చూసి జనులు ఆయనకు మతి భ్రమించిందని భావించేవారు. సత్యశోధనలో నిరంతర సాధనలతో రోజులు, వారాలు, నెలలు గడిచిపోసాగాయి. అప్పుడు శ్రీరామకృష్ణులకు అద్భుత దివ్యదర్శనాలు కలుగసాగాయి. స్వయంగా జగజ్జననియే గురువై ఆయన కోరిన సత్యాలను తెలుపసాగింది. భగవద్దర్శనానికి అవాంతరాలైన కామకాంచనాలను త్యజించి సర్వత్రా ఆ సర్వేశ్వరిని దర్శించిన త్యాగేశ్వరుడు శ్రీరామకృష్ణుడు. ❖


పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

డి.వి. రామచంద్రరావు, విశాఖపట్నం

? : భృగు మహర్షి త్రిమూర్తులను శపించాడని పురాణాల్లో ఉంది. మహర్షులకు శాంత గుణం ఉండాలి. ఒక ఋషి త్రిమూర్తులను శపించడమేమిటి?

✍: మహర్షుల కోపం లోక కల్యాణానికేనని తెలుసుకోవాలి. భృగు మహర్షి సామాన్యుడు కాడు. బ్రహ్మదేవుని చర్మం నుండి పుట్టాడు. దక్ష యజ్ఞంలో ఋత్విక్కుగా ఉన్నందు వల్ల నందికేశ్వరునిచే మృత్యువాత పడ్డాడు. మళ్ళీ వైవస్వత మన్వంతరంలో వరుణుని బ్రహ్మయజ్ఞంలో పునర్జన్మ పొందాడు. ఆయనను 'వారుణి' అంటారు. మహర్షుల శాపాలు జగత్తు కల్యాణానికే! ఋషులు, జ్ఞానులు వేద జ్ఞాన రాశిని మనకందించారు. భృగు శాపం వల్ల మహా విష్ణువు శ్రీరాముడిగా జన్మించి, రావణ వధ చేసి ఆదర్శ మానవుడిగా ఎలా జీవించాలో తెలిపాడు. ధర్మం, పితృవాక్యపాలన, భ్రాతృప్రేమలను ఆచరించి 'రామో విగ్రహవాన్ ధర్మః సత్య పరాక్రమః' అని అనిపించుకున్నాడు. దానికి భృగు మహర్షి నిమిత్త మాత్రుడయ్యాడు. ఋషులు భగవదంశ సంభూతులే. వేదాలు, ఉపనిషత్తులు పఠించి, ఋషి ఋణం తీర్చుకోవాలి.



కిరణ్ కుమార్, చెన్నై

?: అ)ప్రదోషమనగానేమి? ప్రదోషకాల ప్రాముఖ్యం తెల్పండి.
ఆ) సప్తశ్లోక గీత అంటే ఏమిటో వివరించ మనవి?

అ) ప్రదోషం– దేవాలయాల్లో (ముఖ్యంగా శివాలయాల్లో) సాయంసంధ్య వేళ పూజలు చేసి స్వామి ఉత్సవమూర్తిని నాలుగు వీధుల్లో ఊరేగిస్తారు. అప్పుడు చతుర్వేదాలు, పురుషసూక్తం, రుద్రం, చమకం చదువుతారు. వైష్ణవులు ఏకాదశి ఉపవాసం, స్మార్తులు త్రయోదశి వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే సూర్యాస్తమయం నుంచి ఆరు ఘటికల (ఒక ఘటిక= 24 నిముషాలు) సమయం. 'నక్తం' చేస్తున్నవారు పగలంతా తినకుండా రాత్రి ఒక్కసారి ప్రదోష సమయంలో భుజిస్తారు. ఏకాదశి ఉపవాసాన్ని ప్రాయశ్చిత్త కర్మగా భక్తులు చేస్తారు.

ఆ) శ్రీమద్భగవద్గీతలోని సప్తశ్లోకి గీతలు సారభూతమైనవి. వాటిని ఈ దిగువ ఇస్తున్నాం.

1. *ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్।*
   యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్॥
   (అధ్యాయం 8 - అక్షర పరబ్రహ్మయోగం. 13వ శ్లోకం)

2. *స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా, జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ।*
   రక్షాంసి భీతాని దిశో ద్రవంతి, సర్వే నమస్యంతి చ సిద్ధ సంఘాః ॥
   (అధ్యాయం 11 - విశ్వరూపసందర్శనయోగం. 36వ శ్లోకం)

3. *సర్వతః పాణిపాదం తత్ సర్వతో உక్షి శిరోముఖమ్।*
   సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥
   (అధ్యాయం 13 - క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం. 14వ శ్లోకం)

4. కవిం పురాణమనుశాసితారమ్ అణోరణీయాం సమనుస్మరేద్యః।
   సర్వస్య ధాతారమచింత్య రూపమ్, ఆదిత్యవర్ణం తమసఃపరస్తాత్ ॥
   (అధ్యాయం 8 - అక్షరపర బ్రహ్మయోగం. 9వ శ్లోకం)

5. ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్।
   ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్॥
   (అధ్యాయం 15 - పురుషోత్తమప్రాప్తియోగం. 1వ శ్లోకం)

6. సర్వస్య చాహం హృది సన్నివిష్టో, మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ।
   వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో, వేదాంతకృద్వేదవిదేవ చాహమ్॥
   (అధ్యాయం 15 - పురుషోత్తమప్రాప్తియోగం. 15వ శ్లోకం)

7. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
   మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః ॥
   (అధ్యాయం 9–రాజవిద్యా రాజగుహ్యయోగం. 34వ శ్లోకం)

పై ఏడు శ్లోకాలనూ కలిపి 'సప్త శ్లోక గీత' అంటారు. భగవద్గీతా సారాన్ని ఈ పై శ్లోకాలు తెలుపుతున్నాయి. ❖



వేంకటేశుని సేవలో తరించిన
తరిగొండ వెంగమాంబ

– బి.కృష్ణకుమారి

కలియుగ దేవదేవుడు... కరుణాంతరంగుడు శ్రీ వేంకటేశ్వరుడి పరమపావన భక్తశిఖామణుల్లో నిత్య స్మరణీయురాలు తరిగొండ వెంగమాంబ. తన రసరమ్య కావ్యసుమాలతో ఆ వైకుంఠవాసుని అర్చించి తరించిన ఆదర్శయోగిని... సమకాలీన సాంఘిక దురాచారాలపై సమరం పూని, దాష్టీకాలను ప్రతిఘటించిన సాధ్వీమణి. భక్తిని, జ్ఞానాన్ని, పరమార్థ ప్రాభవాన్ని పామరజనుల చెంతకు చేర్చిన ధన్యచరిత తరిగొండ వెంగమాంబ. అందుకే నాటి నుంచి నేటి వరకు ఆ తిరుమలవాసునికి తాళ్లపాక వారు లాలిపాడితే, తరిగొండ వారు హారతి పట్టడం ఆనవాయితీగా వస్తూ ఉంది. అన్నమయ్యకు సమంగా ఆ ఆనందనిలయుడిని తన మధురకీర్తనలతో సేవించిన కారణజన్మురాలు తరిగొండ వెంగమాంబ.

వరప్రసాదిని వెంగమాంబ...

ఆ కోనేటిరాయడు కొలువుదీరిన తిరుమల తిరుపతి క్షేత్రానికి సమీపంలోని తరిగొండ గ్రామంలో క్రీ.శ. 1730లో ఆ వేంకటేశుని వరప్రసాదంగా జన్మించారు తరిగొండ వెంగమాంబ. కానాల కృష్ణయ్య, మంగమ్మ పుణ్యదంపతులు ఎన్నో ఏళ్ళపాటు ఈ పుండరీకాక్షుడికి చేసిన పూజల ఫలితంగా ఆ మహిమాన్విత అవతరించారు. బాల్యం నుంచే తన జన్మకారణాన్ని గుర్తించినట్లు ఆ భక్తవత్సలుడి భజనలతోనే కాలం గడిపేవారు. సాధారణ బాలికల్లా కాకుండా, నిరంతరం ఆ నీరజనాభునికి నీరాజనాలతోనే పొద్దుపుచ్చుతున్న వెంగమాంబను చూసి తల్లితండ్రులు ఆందోళన చెందేవారు. గృహస్థ జీవితంతోనైనా ఆమె వైఖరిలో మార్పు వస్తుందని సంకల్పించి వివాహం జరిపించారు.

వైధవ్యం నుంచి విశిష్టయోగినిగా...

ఆశించేవాడు మానవుడయితే, శాసించేవాడు భగవంతుడన్న నానుడి వెంగమాంబ జీవితంలోనూ నిరూపితమైంది. కోటి ఆశలతో ఆమె తల్లితండ్రులు కొంగుముడి వేసినా, ఆ కస్తూరీ తిలకుడు విధిని మరోలా లిఖించాడు; వెంగమాంబను బాలవితంతువుగా మిగిల్చాడు. అయినా ఆ పరమదయాళువునే తన పెనిమిటిగా భావించి పూజాపునస్కారాలతో నిత్య సుమంగళిగా పూలు, కుంకుమ, గాజులు ధరిస్తూ, తరిగొండ నారసింహ దేవుడినే కులదైవంగా ఆరాధించేది ఆ సాధ్వీమణి. ఇదే సమయంలో వెంగమాంబ ఎన్నో ఆధ్యాత్మిక ఉపాసనలతో, సాధనలతో విశిష్టయోగినిగా పరిణమించారు. అలవోకగా కీర్తనలు, భక్తిశతకాలు వల్లించేవారు.

ఛాందసులను ధిక్కరించిన చరితార్థురాలు...

కానీ యుక్తప్రాయంలోనే సంభవించిన వైధవ్యం వెంగమాంబ పాలిటి శాపంగా పరిణమించింది. నిందలు, నిష్ఠూరాలతో లోకులు పలుకాకులై తూలనాడే వారు. అతివలను ముఖ్యంగా వితంతువులను అతి చులకనగా చూసే ఆనాటి సమాజం ఆమె ప్రతిభావ్యుత్పత్తులను నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా కాలరాసే ప్రయత్నం చేసింది. ఎన్నో అవమానాలతో ఆమె భక్తిపారవశ్యానికి, పాండితీప్రకర్షకు అవరోధాలను కల్పించ చూసింది. అయినా ఆ సాధ్వీమణి ఆ ఛాందసులు కల్పించిన ఎన్నో ప్రతికూలతలను ధీరోదాత్తంగా ఎదుర్కొన్నారు. ఆత్మబలాన్ని కోల్పోకుండా ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆ సమయంలోనే స్థితప్రజ్ఞత ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఇలా అంటారు వెంగమాంబ.


"దూషణంబులు విని దుఃఖింతువేల?
భూషణంబులు గని పొంగెదవె బేలా!
ద్వేషులే హితులని తెలియవే బాలా!
రోషమును త్రుంచి పోరుటమాను మబలా!"... పొగడ్తలకు పొంగిపోకుండా, తెగడ్తలకు కుంగిపోకుండా, ద్వేషానికి, రోషానికి అతీతంగా అసామాన్యంగా ఎదగమంటారు ఆ పరమపావని.


అరణ్యమార్గం గుండా ఆ వేంకటేశుని కొండకు....

స్వగ్రామమైన తరిగొండలో తనపై పెరుగుతున్న అనుమానాలకు, అవమానాలకు విసిగిపోయిన వెంగమాంబ ఒక శుభసందర్భంలో అరణ్యమార్గం గుండా పయనించి తిరుమల చేరుకున్నారు. దివ్యాతిదివ్యమైన ఆ మోహనాకారుని మంగళస్వరూపాన్ని గాంచి తన్మయురాలై తిరుమల రమణీయతను మనోహరంగా వర్ణించారు. 'వేంకటాచల మాహాత్మ్యం' రచించారు. తన గమనం, గమ్యం అన్నీ గోవిందుడే అని గుర్తించారు. ఆ సహస్రనాముని స్తుతిస్తూ ఆశువుగా ఎన్నో కీర్తనలను కుసుమాలుగా అల్లి *(మిగతా 30వ పేజీలో)*

భక్తుని ఇంట గంగావతరణం

కథ: ఎం.వి. నాగప్రసాద్ చిత్రాలు : సి.హెచ్. రమేష్




6. గంగ కన్నా పరమ పవిత్రులైన
గురుదేవుల పాదాలు స్పృశించి వచ్చాను...
7. నిజమైన భక్తుడికి గంగామాత ఎదుటే దర్శనమిస్తుంది.
8. మామగారు మీ మాటలు విశ్వసించరు.
9. నీ నమ్మకాలతో నాకు నిమిత్తం లేదు. నేను గంగాస్నానం చేయాలి. కలకత్తాకు తీసుకు వెళ్ళు.
10. నా కోరిక తీర్చడం పుత్రునిగా నీ కర్తవ్యం!
11. నాన్నగారి మనసు నొప్పించడం ఎందుకు! తప్పకుండా కలకత్తా వెళదాం.
12. నాకిప్పుడు సంతోషంగా ఉంది. ఈ విషయం మామగారికి కూడా చెప్పి ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తాను.
13. బుడ బుడ అనే శబ్దంతో పెరట్లో నేలలో నుంచి నీరు పొంగుతోంది.

మిగతా 36వ పేజీలో...



దివ్యభావసాగరుడు

- స్వామి అనుపమానంద

శ్రీరామకృష్ణ ఆరాత్రిక స్తోత్రంలో స్వామి వివేకానంద శ్రీరామకృష్ణుల వారిని "భాస్వర భావసాగర చిర ఉన్మద ప్రేమపాథార్"అని స్తుతించారు. "భావసాగర" అంటే దివ్యభావాల సముద్రం.

గురుభావం : ఈ గురుభావం శ్రీరామకృష్ణులలో బాల్యం నుంచే కనపడేది. అయితే బాల్యంలో అంత ప్రబలంగా ఉండేది కాదు. అవసరమైనప్పుడు బాల్యంలో కూడా కామార్పుకూర్ గ్రామ ప్రజలకు ఆయన మార్గనిర్దేశం చేసేవారు. సాధకభావం పూర్తయ్యాక వారికి అనేక విధాలుగా భగవత్ సాక్షాత్కారం కలిగింది. శ్రీరామకృష్ణులు క్రమంగా పలువురు శిష్యులకు మార్గనిర్దేశం చేసేవారు. వారి వారి భావాలనూ, వారి స్థాయులనూ బట్టి అందరినీ ఉన్నతుల్ని చేశారు. వారి దగ్గరకు వివిధ రకాలైనవారు వచ్చేవారు. లాటూ లాంటి నిరక్షరాస్యులు, గౌరీపండితుడు, వైష్ణవ చరణ్ లాంటి మహాపండితులు, నరేంద్రనాథ్, మాస్టర్ మహాశయ్ లాంటి పాశ్చాత్యవిద్యను అభ్యసించిన వాళ్ళూ వచ్చేవారు. వారి వారి సాధ్యతాశక్తి, అభిరుచి, భావాలకు అనుగుణంగా వారిని వారి స్థాయి నుండి అత్యున్నత స్థాయికి శ్రీరామకృష్ణులు చేర్చేవారు.



వైష్ణవ చరణ్ గొప్ప పండితుడు, సాధకుడు. అయినా అతనికి సాక్షాత్కారం కలగలేదు. శ్రీరామకృష్ణుల మార్గ నిర్దేశనలో అతని అవరోధాలు తొలగి, భగవత్సాక్షాత్కారం కలిగింది. భైరవీ బ్రాహ్మణి దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు నిస్సందేహంగా అవతార పురుషులే అని చెప్పింది. అది నిరూపించడానికి చాలా మంది పండితుల్ని పిలిపించారు. వారిలో గౌరీపండితుడు ఉన్నాడు. "తాను పురాణాలు, శాస్త్రాలలో చదివినవన్నీ శ్రీరామకృష్ణుల వ్యక్తిత్వంలో స్పష్టంగా వ్యక్తమవుతున్నాయి" అని గ్రహించిన గౌరీపండితుడికి వారి పట్ల గొప్ప భక్తి కలిగింది.

'మ' (మాస్టర్ మహాశయ్), శ్రీరామకృష్ణుల దగ్గరకు మొదటిమారు వెళ్ళినప్పుడు, వారిని కలవడానికి ముందు దక్షిణేశ్వరంలోని పనిమనిషి బృందతో 'శ్రీరామకృష్ణులు పురాణాలు, శాస్త్రాలు చదివారా?' అని అడిగారు. అందుకు బృంద 'పుస్తకాలా? వారు పుస్తకాలేమీ చదవరు. అవన్నీ ఆయన నాలుక మీదే ఉంటాయి' అంది!

లాటూ (స్వామి అద్భుతానంద)మహరాజ్ విద్యాగంధం లేని అమాయకపు పల్లెటూరి పిల్లవాడు. గురుదేవుల పట్ల ఉన్న నమ్మకం వల్ల గొప్ప సాధువు అయ్యాడు. ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలు కలిగాయి.

ఒక బాల వితంతువు శ్రీరామకృష్ణుల భక్తురాలు. ఆమె ఇష్టదైవం బాలకృష్ణుడు. ధ్యానానికి కూర్చున్నప్పుడు ఆమెకు తాను ఎంతో అభిమానించే తన మేనల్లుడి ముఖమే కనపడేది. చివరకు ఆమె గురుదేవుల దగ్గరకు వెళ్ళి తన పరిస్థితిని వివరించి, తానేం చెయ్యాలో చెప్పాల్సిందిగా వేడుకుంది. శ్రీరామకృష్ణులు "నీ మేనల్లుడికి చేసే ప్రతీ పనీ బాలకృష్ణుడికి చేస్తున్నాను అనుకుంటూ చెయ్యి. ఆ పసివాణ్ణి స్వయంగా బాలకృష్ణుడే అనుకో" అన్నారు. ఆమె అలాగే చేసి అతితక్కువ కాలంలోనే ఆధ్యాత్మిక అనుభవాలు పొంది, సమాధి స్థితికి చేరుకుంది. ఒక గురువుగా వారి శక్తి అత్యంత అపారమైనది.

దివ్యభావం : ఆంతరంగిక భక్తులు వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు వారిని "నా గురించి నువ్వు ఏమను కుంటున్నావు?" అని అడిగేవారు. వారిచ్చే జవాబును బట్టి వారి ఆధ్యాత్మికత ఎంత తీవ్రమైనదో నిర్ణయించేవారు. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ఇప్పుడు ఈ ప్రశ్నను ఎవరికి వారు వేసుకోవాలి. మన ఆధ్యాత్మిక జీవితంలో దీని సమాధానానికి చాలా ప్రాముఖ్యం ఉంది.

కామార్పుకూర్‌లో ఒక నిరుపేద భక్తుడు ఉండేవాడు. శ్రీరామకృష్ణుల బాల్యంలో (ఏడెనిమిదేళ్ళ వయస్సులో) అతను ఒకమారు శ్రీరామకృష్ణులను ధూప, దీప, నైవేద్యాలతో అర్చించాడు.

భైరవీ బ్రాహ్మణి ఇష్టదైవం రాముడు. ఆమె రాముణ్ణి ఆరాధించేది, ధ్యానించేది. ఒకరోజు ఆమె పంచవటిలో వంట చేసి, రాముడికి నివేదన చేసి ధ్యానానికి కూర్చుంది. శ్రీరామకృష్ణులు ఒక దివ్యభావావేశంలో అక్కడకు వెళ్ళి రాముడికి నివేదించిన పదార్థాలను తినడం ప్రారంభించారు. కొంత సమయం గడిచాక భైరవి కనులు తెరచి, శ్రీరామకృష్ణులు నైవేద్యం ఆరగిస్తూ ఉండడం చూసి ఆశ్చర్యపోయింది. ఆమెకు నోట మాట రాలేదు. ఎన్నో ఏళ్ళుగా ఆమె రఘువీరుణ్ణి ధ్యానిస్తోంది; ఆ స్వామి ఇప్పుడు ఆమె ఎదుట ఉన్నారు. శ్రీరామకృష్ణులు ఆమెకు రఘువీరుడి రూపంలో దర్శనమిచ్చారు; అప్పుడు ఇక ఈ రాముడి ప్రతిమ అవసరం లేదు అనుకుని గంగానదిలో దాన్ని విడిచిపెట్టింది. ఆ విధంగా శ్రీరామకృష్ణులలో రఘువీరుడి దర్శనం అయింది భైరవీ బ్రాహ్మణికి.



మధుర్‌నాథ్ జాతకంలో అతని ఇష్టదైవం సదా అతనితోనే ఉంటూ అతణ్ణి రక్షిస్తుంటాడని ఉంది. శ్రీరామకృష్ణులు అవతారపురుషుడు అని పండితులందరూ నిర్ధారించినా మధుర్‌కు పూర్తిగా నమ్మకం కలగలేదు. ఒక రోజు అతను తన గదిలో కూర్చొని కిటికీలో నుండి బయటికి చూస్తున్నాడు. అతని గదికి ఎదురుగా, దూరంగా వరండాలో శ్రీరామకృష్ణులు అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. మధుర్ ఏదో ఆలోచిస్తూ వారి వైపే చూస్తున్నాడు.

కాసేపయ్యాక ఒక అద్భుతం జరిగింది. మధుర్ అది చూసి ముందు తాను కలగంటున్నానేమో అనుకున్నాడు, కళ్ళు నులుముకుని మరీ చూశాడు. శ్రీరామకృష్ణులు అటు వైపు నుండి మధుర్‌కి అభిముఖంగా వస్తున్నప్పుడు కాళీమాతలా కనపడుతున్నారు. వెనక్కి తిరిగి రెండోవైపు నడుస్తున్నప్పుడు శివుడిలా కనపడుతున్నారు. ఆఖరికి తాను చూస్తున్నది నిజమే అని నమ్మి, పరుగు పరుగున వారి వద్దకు వెళ్ళి "నన్ను రక్షించండి" అంటూ వారి కాళ్ళ మీద పడి రోదించాడు. అలాగే 'గోపాలేర్ మా'కు బాలకృష్ణునిలా దర్శనమిచ్చారు శ్రీరామకృష్ణులు.

1886 జనవరి 1వ తేదీన శ్రీరామకృష్ణుల భక్తులు కాశీపూర్ ఉద్యానగృహంలో వారిని అవతారపురుషునిగా దర్శించి, ఆరాధించి, వారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆ రోజున శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శ పొందిన వారందరికీ ఎవరెవరు భగవంతుణ్ణి ఏ యే రూపాలలో చూడాలనుకున్నారో వారికి ఆ యా రూపాలలో దర్శనం లభించింది.

ఈ యుగంలో ప్రజలకు మార్గనిర్దేశం చెయ్యడానికే శ్రీరామకృష్ణులు అవతరించారనీ, ఆయన భావసాగరుడనీ స్వామి వివేకానంద అభివర్ణించారు. ❖

జర్మనీలో శ్రీరామకృష్ణులు!

రెండవ ప్రపంచ యుద్ధంలో ఎడీ అనే జర్మన్ దేశపు సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతను ఆసుపత్రిలో అపాయకరమైన స్థితిలో ఉన్నప్పుడు ఒక అపరిచిత వ్యక్తి తన పక్కన పడక మీద కూర్చుని తలను స్పృశించినట్లు ఒక దృశ్యం గోచరించింది. తరువాత అతడు ప్రాణాపాయ స్థితి నుంచి క్రమంగా కోలుకున్నాడు. ఆసుపత్రి నుండి విడుదల అయ్యాక ఆ అపరిచిత వ్యక్తి ఎడీకి తరచు జ్ఞాపకం వచ్చేవారు.

1934లో అతను న్యూయార్క్ వెళ్ళినపుడు ఒక పుస్తకంలో శ్రీరామకృష్ణుల చిత్రపటాన్ని చూశాడు. ఆసుపత్రిలో ఉన్నప్పుడు చూసిన ఆ అపరిచిత వ్యక్తే శ్రీరామకృష్ణులని తెలుసుకొన్నాడు. తరువాత ఎడీ కలకత్తాలోని బేలూరు మఠానికి వచ్చి అప్పుడు రామకృష్ణ సంఘ అధ్యక్షులుగా ఉన్న స్వామి అఖండానంద మహరాజ్‌కు తాను శ్రీరామకృష్ణులను దర్శించిన సంఘటనను తెలియజేశాడు.

స్వామి అఖండానందజీ ఎడీకి మంత్రదీక్షను, తరువాత బ్రహ్మచర్య దీక్షను ప్రసాదించారు. స్వామి అఖండానందజీ మహాసమాధి చెందే వరకూ ఎడీ (బ్రహ్మచారి ఆదిచైతన్య) వారి సేవ చేశాడు. వారు సమాధిగతులయ్యాక తపస్సు చేయడానికి హిమాలయాలకు వెళ్ళాడు. ❖



ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వగాయకుడు - ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ తన సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన జీవితానుభవాలను 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.)

(...గత సంచిక తరువాయి)

కాళీమాతనూ, ఆమె లీలల్నీ ఎంతగా ద్వేషించే వాణ్ణి! ఆరేళ్ళ సుదీర్ఘ పోరాటం జరిగినా నేను కాళీమాతను స్వీకరించలేదు. కానీ ఆఖరికి అమ్మను స్వీకరించక తప్పలేదు. రామకృష్ణ పరమహంస నన్ను అమ్మకు సమర్పించారు; ఆమే నేను చేసే ప్రతి చిన్న పనికీ దారి చూపుతోంది. ఆమె ఇచ్ఛయే సర్వత్రా నెరవేరుతోందని ఇప్పుడు నాకు పూర్తి విశ్వాసం! అయినా ఎంతకాలం పోరాడాను! 'మా గురుదేవుల్ని ప్రేమించాను' - చూశావా! ఆ ప్రేమే నన్ను బంధించింది. ఆయన పవిత్రతను చూశాను. ఆయన అద్భుత ప్రేమను ఆస్వాదించాను. ఆయన గొప్పదనం అప్పుడు నాకింకా అర్థం కాలేదు. వారికి శరణాగతుడనయ్యాకనే వారి మహనీయత తెలుసుకోగలిగాను. అంతకు ముందు 'ఆయన ఎల్లప్పుడూ ఏవేవో దర్శనాలు పొందుతూ ఉండే ఓ వెర్రివెంగళప్ప' అనుకున్నాను. అన్నిటినీ అవహేళన చేసేవాణ్ణి. ఆఖరికి నేనూ కాళీమాతను స్వీకరించక తప్పలేదు.

కాదు, కాదు; అలా అమ్మకు ఎందుకు శరణాగతుడనయ్యానన్నది ఒక రహస్యం! అప్పుడు నాకెన్నో కష్టాలు వచ్చాయి... కాళీమాత నన్ను తన బానిసగా చేసుకుంది. అక్షరాలా - 'నన్నొక బానిసగా'! శ్రీరామకృష్ణులే నన్ను కాళీమాతకు అంకితం చేసేశారు... ఆశ్చర్యం! అదయ్యాక కేవలం రెండేళ్ళే ఆయన జీవించారు, అందులోనూ చాలాకాలం అనారోగ్యంతో బాధ పడ్డారు; ఆరు నెలల కన్నా ఎక్కువ కాలం ఆయన ఆరోగ్యంగా లేరు.

ఆధ్యాత్మిక జీవితంలో శాశ్వత విశ్వాసం, అనుభూతి కలగలేదని ఎవరూ చింతించకండి! స్వయంగా శ్రీరామ కృష్ణులతో ఆరేళ్ళ పాటు సంఘర్షణ జరిపాను. తత్ఫలితంగా ఈ మార్గంలోని ప్రతి అంగుళమూ నేను తెలుసుకున్నాను. ప్రతి అడుగూ నాకు తెలుసు! నా భక్తి ఎలాంటిదో తెలుసా? అది శునకపు భక్తి (దృఢమైనది)... నేనే చాలా సార్లు తప్పుగా ఆలోచించాను; కానీ గురుదేవులు సదా నాకు సరైన మార్గం చూపేవారు. అందువల్ల వారి ఉపదేశాలనూ, నిర్ణయాలనూ ఇప్పుడు గుడ్డిగా నమ్ముతాను.

శ్యామ్‌పుకూర్, 27 అక్టోబర్ 1885 : మేము శ్రీరామకృష్ణులను దైవంతో సమానంగా భావిస్తాం. అదెలాగో తెలుసా? వృక్షజాతికీ జంతుజాతికీ మధ్య ఓ రకమైన సృష్టి ఉంది. అక్కడ ఒక నిర్దిష్ట వస్తువును అది 'వృక్షమా లేక జంతువా?' తేల్చి చెప్పడం చాలా కష్టం! అలాగే, మానవ లోకం, దైవలోకాల మధ్యన ఒక స్థితి ఉంది. అక్కడ ఆ వ్యక్తిని గురించి అతను 'మనిషా లేక దైవమా?' అని కచ్చితంగా చెప్పడం చాలా కష్టం! శ్రీరామకృష్ణులు భగవంతుడని నేను అనడం లేదు, 'ఆయన భగవంతుని లాంటి మనిషి, దైవస్వరూపుడు' అంటున్నాను. దైవంతో సమానంగా మేము ఆయన్ని పూజిస్తాం.

కాశీపూర్, 4 జనవరి 1886 : ఈ రోజు దక్షిణేశ్వరం వెళ్ళి, అక్కడ బిల్వవృక్షం కింద ధుని వెలిగించి ధ్యానం చేద్దామని ఉంది. నేను చదివినదంతా మరిచిపోయేలా చేసే మందు ఏదైనా దొరికితే చాలా సంతోషిస్తాను... క్రితం శనివారం ఇక్కడ ధ్యానం చేస్తుండగా, హఠాత్తుగా హృదయంలో ఒక విచిత్రమైన కదలికలా తోచింది. బహుశః అది కుండలినీ జాగరణ అయి ఉండవచ్చు; అప్పుడు ఇడా, పింగళా నాడుల్ని స్పష్టంగా దర్శించాను. హాజ్రా (దక్షిణేశ్వరం-కాళీ ఆలయంలో నివసించే భక్తుడు)ను నా ఛాతీని తాకాల్సిందిగా అడిగాను. నిన్న గురుదేవుల్ని మేడ మీద కలిసి, ఈ విషయం తెలిపి ఇలా అన్నాను- "మిగతా అందరూ సాక్షాత్కారం పొందారు;

నాకూ కొన్ని అనుభూతుల్ని ప్రసాదించండి. అందరూ విజయవంతులయ్యారు. నేనొక్కడినే అసంతృప్తితో మిగిలి పోవాలా?" అందుకు వారు ఇలా అన్నారు– "నీవు మొదట మీ కుటుంబ వ్యవహారాలన్నీ చక్కబెట్టి, తరువాత నా వద్దకు రా! నీకు సర్వమూ సిద్ధిస్తుంది. అసలు నీకేం కావాలి?"

నేనిలా బదులిచ్చాను: "సమాధిలో నిరంతరాయంగా మూడు, నాలుగు రోజుల పాటు పూర్తిగా లీనమై ఉండి, అప్పుడప్పుడూ కొద్దిగా ఆహారం తీసుకోవడానికి మాత్రమే ఈ బాహ్య (ప్రపంచ) స్పృహలోకి దిగి రావాలి. ఇదే నా కోరిక". దానికి ఆయనిలా అన్నారు– "నీది చాలా అల్పబుద్ధి. అంతకన్నా కూడా ఉన్నతమైన స్థితి ఉంది. 'జో కుఛ్ హై సో తూ హీహై' ('ఏదైతే ఉన్నదో, అదంతా నీవే ప్రభూ!' – హిందీలో ప్రఖ్యాత భజన) పాట పాడేది నీవే కదా!... మీ కుటుంబ వ్యవహారాల్ని చక్కబెట్టి రా! నీవు సమాధి కన్నా ఉన్నత స్థితిని పొందుతావు".



ఈ ఉదయం ఇంటికెళ్ళాను. మా ఇంట్లో వాళ్ళు "దేశదిమ్మరిలా ఎందుకు తిరుగుతావు?' నీ 'లా' (న్యాయశాస్త్ర) పరీక్షలు దగ్గరలో ఉన్నాయి; నీకు చదువు మీద ధ్యాసే లేదు! పనీ పాటా లేకుండా నిర్లక్ష్యంగా తిరుగుతున్నావు" అంటూ అరిచారు.

(ప్రశ్న–మీ అమ్మగారు ఏమన్నారు?) .... ఏమీ అనలేదు. మా అమ్మ అనేక వంటకాలు వండి నాకు వడ్డించడంలోనే లీనమైంది. ఏదో కొంచెం తిన్నాను, అనిష్టంగానే!...

మా అమ్మమ్మ గారింటికి చదువుకునేందుకు వెళ్ళాను. పుస్తకం తెరవగానే చదువుకోవడమంటే ఒక మహా భయంకరమైన విషయంగా తోచి, తీవ్ర భయంతో కంపించి పోయాను. నా హృదయం క్షోభించింది. కన్నీళ్ళు కట్టలు తెంచుకున్నాయి. అంత హృదయ విదారకంగా జీవితంలో నేనెప్పుడూ రోదించలేదు... పుస్తకాల్ని వదిలి వీధుల గుండా పరుగులెత్తాను, నా చెప్పులు కాళ్ళ నుండి జారిపోయాయి– ఎక్కడో, ఏమో స్పృహే లేదు! ఒక గడ్డివాము మీదుగా పరుగెత్తి, నా ఒళ్ళంతా గడ్డి అతుక్కుంది. అలాగే కాశీపూరు వెళ్ళే రోడ్డు వెంబడి పరుగెత్తుతూనే ఉన్నాను...


'వివేక చూడామణి' చదివినప్పటి నుంచి నేను చాలా నిరాశపడిపోయాను. అందులో శంకరాచార్యులన్నారు – "కేవలం గొప్ప తపస్సు, దైవకృపల ద్వారానే మనుష్య జన్మ, మోక్షం పొందాలనే తీవ్రమైన ఆకాంక్ష, ఒక మహాపురుషుని సాన్నిధ్యమూ లభిస్తాయి." నేనిలా అనుకున్నాను – "తప్పకుండా ఈ మూడూ నాకు లభించాయి; మహాతపస్సు ఫలితంగా మనిషిగా జన్మించాను, ఆ తపఃఫలంగానే మోక్షాకాంక్ష కలిగింది, మహా తపస్సు ఫలితంగానే శ్రీరామకృష్ణుల లాంటి మహాపురుషులను గురువుగా పొందగలిగాను'... ఈ ప్రపంచంపై నాకిక ఏ ఆసక్తీ లేదు. ఎవరో కొద్దిమంది సద్భక్తులు తప్ప ఇక ప్రాపంచికులెవ్వరి సహవాసమూ నాకు రుచించదు!

కాశీపూర్, 21 ఏప్రిల్ 1886: ఒక చెట్టును చూసినంత స్పష్టంగా ఎవరైనా భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూశారా? శ్రీరామకృష్ణుల అనుభవాలు కేవలం ఆయన మతిభ్రమలై ఉండవచ్చు!

నాకు కావలసింది 'సత్యం'; కొన్నాళ్ళ క్రిందట స్వయంగా శ్రీరామకృష్ణులతో పెద్ద వాగ్వివాదం పెట్టుకొన్నాను.... ఆయనిలా అన్నారు– "నన్ను కొంతమంది భక్తులు 'భగవంతుడు' అంటున్నారు". నేనన్నాను– "వేయి మంది మిమ్మల్ని భగవంతుడని అనవచ్చు; కానీ అది 'సత్యం' అని స్వయంగా తెలుసుకొనే వరకూ నేను మిమ్మల్ని 'భగవంతుడని' పిలవను గాక పిలవను." అందుకు వారు ఇలా అన్నారు – "చాలా మంది చెప్పే విషయం తప్పకుండా సత్యమే అవుతుంది, అదే లోకధర్మం". నేనిలా బదులిచ్చాను – "ఏ విషయమైనా ఎందరో సత్యమని చాటవచ్చును గాక, కానీ అది ముమ్మాటికీ సత్యమేనని నేను స్వయంగా అనుభవం పొంది గ్రహించే వరకూ, నేనెవ్వరి మాటా వినను, నమ్మను అంతే!"

కాశీపూర్, 23 ఏప్రిల్ 1886: ఎన్నో ఏళ్ళ పాటు ఎన్ని గ్రంథాలు, శాస్త్రాలు చదివినా ఏమీ సిద్ధించదు! రెండు మూడు రోజులు సాధన చేసినంత మాత్రాన, ఎవరైనా భగవత్ సాక్షాత్కారం ఎలా పొందగలరు? దైవసాక్షాత్కారం అంత సులువైన విషయమా?... ❖ (సశేషం)

అనుసృజన : స్వామి అర్చనానంద



మధుర భాషణ, కార్యనిర్వహణల్లో...

మార్గదర్శి మారుతి

– ఆకెళ్ల రాఘవేంద్ర

ఎవరితో ఎప్పుడు ఎలా ఎంతవరకు మాట్లాడాలో, మాట్లాడకూడదో; మృదువైన మాటతీరు ఎలా ఉండాలో తెలియచెప్పే మంత్రమే –సంభాషణా చతురత. ఏ పని ఎలా ఏ మేరకు చేపట్టాలో, చేయాలో, ఎవరిచేత చేయించాలో నేర్పేకళే – కార్యదక్షత. అవసరమైతే అనుచరుడిగా, కాని పక్షంలో నాయకుడిగా, అందరికీ సహచరుడిగా ఎలా మెలగాలో తెలియచెప్పేదే– నాయకత్వం. ఈ నైపుణ్యాల్ని ఎంత వివేకంతో, మెళకువతో అంది పుచ్చుకోవాలో నేర్పేదే సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం. విశేషమేమిటంటే – హనుమంతుడు ఈ సాఫ్ట్ స్కిల్స్‌కి పెట్టింది పేరు.

రామాయణంలోని బాల, అయోధ్య, అరణ్య కాండలలో హనుమంతుడి ప్రస్తావన ఉండదు. కిష్కింధకాండలోనే హనుమంతుడు తొలిసారి దర్శనమిస్తాడు. ఆపై సుందరకాండ, యుద్ధకాండల్లో హనుమంతుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. రామాయణంలోని హనుమంతుణ్ణి కేవలం రామభక్తుడిగానో, భగవంతుడిగానో మాత్రమే చూడడం కాకుండా – అంతకుమించి మన జీవితాలకు విలువైన సందేశం అందించే శక్తిగా చూడాలి.

కిష్కింధకు నాయకులయిన వాలి, సుగ్రీవుడు అన్నదమ్ములు. అయినా సుగ్రీవుణ్ణి వెళ్ళ గొట్టి వాలి రాజ్యాన్ని ఆక్రమించుకొన్నాడు. చేసేదిలేక సుగ్రీవుడు తన మిత్రులతో, మంత్రులతో, వానరులతో ఋష్యమూక పర్వతం చేరి నివసించసాగాడు. సుగ్రీవుడి మంత్రులలో ఒకడు హనుమంతుడు. మరోవైపు సీతాన్వేషణలో సుగ్రీవుడి సహాయం తీసుకొనే నిమిత్తం రామలక్ష్మణులు అటుగా వస్తున్నారు. వారెవరో, ఎందుకొస్తున్నారో తెలీక సుగ్రీవుడు తదితరులు మొదట కంగారుపడ్డారు. వాలి కానీ వారిని పంపిస్తున్నాడేమోనని భయపడ్డారు. పారిపోవడం మొదలుపెట్టారు.

పారిపోతున్న సుగ్రీవాదుల్ని వారించిన ఏకైకవ్యక్తి– హనుమంతుడు. వారెవరో, ఎందుకు వచ్చారో తెలుసుకోకుండా, వాలి పంపించాడా లేదా తెలుసు కోకుండా, ఒకవేళ పంపిస్తే దేనికోసం పంపించాడో తెలుసుకోకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా అనవసర ఊహలతో, భయాలతో మనకు మనమే ఆందోళన పెంచేసుకొని, మనల్ని మనమే ఇంకా ఆత్మన్యూనతలోకి నెట్టేసుకొని పారిపోవడం తగదన్నది హనుమంతుడి ఉద్బోధ. తాడుని చూసి పాముని భయపడడం అమాయకత్వమే కాదు, మూర్ఖత్వం కూడా!

మనం కూడా అంతే! మన జీవితాల్లో 'లేని' సమస్యల్ని ఉన్నాయనుకొని భావించి, భ్రమించి భయపడిపోతుంటాం. పరీక్షలో తప్పుతామేమోనని, ఇంటర్వ్యూలో తెలీని ప్రశ్నలు అడుగుతారేమోనని, ఫలానా వ్యక్తిని సహాయం అడిగితే చెయ్యడేమోనని.. ఇలా పనిని ప్రారంభించకుండానే నిరాశలో మునిగిపోతుంటాం. అసలు కార్యం మొదలెట్టాక కదా గెలుపు ఓటములు, సుఖదుఃఖాల సంగతి! ముందే అనవసరంగా భయపడడం అర్థరహితమంటాడు హనుమంతుడు.

'అయితే ఆ ఇద్దరూ ఎవరో తెలుసుకొని రా' అని హనుమంతుణ్ణి పంపిస్తాడు సుగ్రీవుడు. అప్పుడు హనుమంతుడు తన వానరరూపం వదిలిపెట్టి విప్రుని రూపం ధరించి – రామలక్ష్మణుల దగ్గరకు వెళ్ళాడు. ఇక్కడే హనుమంతుడి మాటతీరులోని గొప్పతనం బయట పడుతుంది. తానెవరో చెప్పకుండా వచ్చినవారెవరో తెలుసుకోవాలి. ఆ తెలుసుకోవడం – ప్రశ్నిస్తున్నట్లుగానో, కూపీలాగుతున్నట్లుగానో ఉండకూడదు. 'మీరెవరు' అని ముక్కుసూటిగా అడిగితే లాభం ఉండకపోవచ్చు. ఆ వచ్చిన వారు – నిజంగా సుగ్రీవుడు భయపడినట్లు వాలి పంపిన వారే అయితే – ఆ సత్యాన్ని ఎలా తెలుసుకోవాలి? వారి రాకలోని మర్మం ఎలా బయటపెట్టాలి? సుగ్రీవుడికి హాని చేయడం కోసమే వస్తే ఆ ఆలోచనను ఎలా మానిపించాలి? – ఇలా అన్నింటినీ సాధించే విధంగా హనుమంతుడు మాట్లాడాడు.

అందుకు అనుగుణంగానే – తొలుత రామలక్ష్మణుల్ని పొగిడాడు; మీరేదో వెతుకుతూ వస్తున్నట్లున్నారు అని అన్నాడు.



వినమ్రంగానైనా సూటిగా 'మీరెవరో' చెప్పండి అని అడిగాడు. ముక్తసరిగా కాకుండా విశ్లేషణాత్మకంగా, తార్కికంగా మాట్లాడాడు. హనుమంతుడు మాట్లాడినదంతా రామలక్ష్మణులు మౌనంగా విన్నారు. అంతవరకూ మాట్లాడుతూనే హనుమంతుడు వారిద్దరూ అనుమానించ దగ్గవారు కారని నిశ్చయించుకొన్నాడు. అంతవరకూ తానెవరో చెప్పని హనుమంతుడు తన స్వీయ వృత్తాంతం చెప్పడం వల్ల నష్టమేమీ లేదని రూఢిచేసుకొన్నాడు. తన గురించి, సుగ్రీవుడి గురించి, వాలి చేసిన కుట్ర గురించి క్లుప్తంగా వివరించాడు. నిజాన్ని కప్పిపుచ్చకుండా నిజాయతీగా మాట్లాడడమే ఇక్కడ హనుమంతుడు ప్రదర్శించిన మాటనేర్పరితనం.

హనుమ మాటలు విన్నాక లక్ష్మణుడితో రామచంద్రుడు మాట్లాడిన మాటల్ని గమనిస్తే – సంభాషణా చాతుర్యాన్ని హనుమంతుడు ఎంత అద్భుతంగా ప్రదర్శించాడో అవగత మవుతుంది – "లక్ష్మణా! చూశావా! ఇతను ఒక్క వ్యాకరణ దోషం కూడా లేకుండా మాట్లాడాడు. ముఖంలో కానీ, కళ్ళల్లోకానీ, నుదిటిపై కానీ, కనుబొమ్మలలో కానీ, ఇంకా ఇతర అవయవాలలో కానీ ఎలాంటి వికారమూ కనపడ నీయకుండా మాట్లాడాడు. ఆగిఆగి మాట్లాడలేదు. అలాగని గబగబానూ మాట్లాడలేదు. సందిగ్ధంగా, సంకోచంగా మాట్లాడ లేదు. స్పష్టంగా మాట్లాడాడు. సాగతీసి మాట్లాడలేదు. కంఠం కంపించకుండా, తల ఆడించకుండా మాట్లాడాడు. ఇతను మాట్లాడినట్లు ఎవరైనా మాట్లాడితే 'చంపేందుకు కత్తి ఎత్తిన శత్రువు కూడా' ఆగిపోవాల్సిందే."

ఇదండీ సంగతి! సంభాషణా చతురత గురించి తెలుసు కోవాలంటే హనుమంతుణ్ణి అధ్యయనం చేసి ఆచరిస్తే చాలన్నమాట!

అదే విధంగా సీతాన్వేషణలో భాగంగా హనుమంతుడు లంకకు చేరుకొన్నాడు. అశోకవనంలో శింశుపావృక్షం మీద దాక్కొని హనుమంతుడు సీతను చూశాడు. సీత ఉందని తెలుసుకొన్న వెంటనే – తిరుగు ప్రయాణం కట్టేయలేదు హనుమంతుడు. లంకలో హనుమంతుడు చేసిన చేష్టలన్నీ వ్యవహారజ్ఞానానికి, నిర్వహణా కళకు నిదర్శనాలుగా నిలుస్తాయి.

"శోకిస్తున్న సీతమ్మతో మాట్లాడకుండా వెళ్ళిపోతే 'తనను కాపాడేవారు ఎవరూ లేరనుకొని సీతమ్మ నిరాశపడి మరణించ వచ్చు. అక్కడికి వెళ్ళాక – సీతాదేవి తనతో ఏమి చెప్పమన్నది అని రాముడు నన్ను అడిగితే 'ఆమెతో నేనేమీ మాట్లాడలేదు. అందువల్ల ఆమె నాతో ఏమీ చెప్పలేదు' అన్న సమాధానం చెపితే నా అంత తెలివి తక్కువ వాడు లేనట్లే" – అని హనుమంతుడు తనలో తాను అనుకొన్నాడు. ఒక పని నిర్వర్తించడానికి వెళ్ళినప్పుడు సమర్థుడు ఇన్ని విధాల ఆలోచించాలన్నమాట!

తాను హఠాత్తుగా ఎదురుపడితే సీతమ్మ భయపడుతుందని హనుమకు తెలుసు. అందుకే ముందు రామకథను చెట్టు మీద నుంచే గానం చేశాడు. దాంతో ఆమెకు తనపై, తనమాటపై, తన రాయబారంపై గురి కుదిరేలా చేసుకొన్నాడు. ఆమెతో మాట్లాడాడు. ధైర్యం చెప్పాడు, త్వరలోనే రాముడు వచ్చి రక్షిస్తాడని ఆమెకు భరోసా ఇచ్చాడు.

నిజానికి ఇలా సీతమ్మతో మాట్లాడడంతో హనుమంతుడి కార్యం అయిపోయినట్లే! కాబట్టి వెనక్కి కిష్కింధకు వెళ్ళిపోవచ్చు. కానీ వెళ్ళడు కార్యనిర్వహణ దక్షత కలిగిన హనుమంతుడు. లంకలోనే ఇంకా ఉండి, రావణుడి బలమెంతో తెలుసుకొని, రాక్షసులకు, వానరులకు యుద్ధం చేయడంలో ఉన్న తారతమ్యాల్ని తెలుసుకొని వెళ్ళాలని నిశ్చయించు కొంటాడు హనుమంతుడు. అందుకనే కావాలనే అశోకవనాన్ని నాశనం చేసి, లంకలోని రాక్షసులు తనపైకి దండెత్తేలా చేసుకొంటాడు హనుమంతుడు. వారు తనపైకి లంఘించి నప్పుడే కదా– రాక్షసుల బలాబలాల్ని బేరీజువేసుకొనే అవకాశం దక్కుతుంది! ఆ విధంగా లంకలోని రాక్షసుల శక్తి సామర్థ్యాల్ని చక్కగా తెలుసుకోవడమే కాక, మహా బలపరాక్రమవంతులైన అనేక మందిని ముఖ్యంగా జంబుమాలి, అక్షకుమారుడు లాంటి అతిబలసంపన్నుల్ని వధించి– రాబోయే యుద్ధంలో వానరుల మార్గాన్ని సుగమం చేసి – అప్పుడు కిష్కింధకు బయలు దేరాడు హనుమంతుడు.

కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ స్కిల్స్ వంటివి అంది పుచ్చుకోవాలనుకొనే ఆధునిక యువత – హనుమంతుణ్ణి అనుసరిస్తే చాలు. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

మాధురీలత, రాజమండ్రి

ప్రశ్న : నేను బి.ఎస్.సి., నర్సింగ్ కోర్స్ చేస్తున్నాను. యువతరం సమస్యలకు చక్కని పరిష్కారాలు 'శ్రీరామకృష్ణ ప్రభ' అందిస్తోంది. ఈ పత్రికను చదివినప్పటి నుంచీ నాలో ఆధ్యాత్మిక జీవితంపై ఆసక్తి పెరిగింది. ఎప్పుడూ భగవంతుని చింతనలో ఉండాలని ప్రయత్నిస్తున్నాను. కానీ అప్పుడప్పుడు చెడు తలంపులు నన్ను వేధిస్తున్నాయి. మనస్సులోనికి చెడు తలంపులు రాకుండా ఉండాలంటే ఏం చేయాలో సూచించండి.



జవాబు: 'భగవంతుణ్ణి కేవలం ఆలయానికే పరిమితం చేయవద్దు. సమాజంలో ఉన్న దరిద్ర, దీన, రోగి నారాయణులకు సేవచేయడం కూడా భగవదారాధనతో సమానమే' అన్న నవీన సందేశాన్ని అందించారు స్వామి వివేకానంద. ఈ సందేశాన్ని ఆచరించి ఆదర్శమూర్తిగా నిలిచిన సోదరి నివేదిత జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. నిరుపేదలు, నిరక్షరాస్యులు, వ్యాధిగ్రస్థులే ఆమెకు ఆరాధ్య దైవాలు. ఆమె జీవితాంతం ఆరాధించిన ప్రత్యక్ష దైవాలు వీరే!

రోగి నారాయణులకు ఆత్మీయతతో, ఆరాధనా భావంతో సేవ చేసి జీవితాన్ని ధన్యం చేసుకొనేందుకు ఓ సాధనగా సహకరించే ఉన్నతమైన వృత్తి మీది. వైద్యాలయంలో రోగులకు సేవ చేస్తున్నప్పుడు దేవాలయంలో ఆ నారాయణుణ్ణి ఆరాధిస్తున్నామనే భావంతో చేస్తే మీరు సదా ఆ భగవంతుని సన్నిధిలో, సేవలో, చింతనలో ఉన్నట్లే కదా!

ఎన్నో జన్మలుగా పోషించిన చెడు సంస్కారాల ప్రభావాన్ని కొద్ది రోజుల ప్రయత్నంతోనే నియంత్రించడం సాధ్యం కాదు. అలాగని నిరుత్సాహపడనవసరం లేదు. దుష్ట సంకల్పాలను నిరోధించేందుకు శ్రీరామకృష్ణులు ఓ చక్కని దృష్టాంతాన్ని ఇచ్చారు.

ఒక యజమాని ఎన్నో ఏళ్ళుగా ఒక కుక్కను ఎంతో మక్కువతో పెంచుకోసాగాడు. అది ఎప్పుడూ ఆయన వెంటే తిరుగుతూ ఉండేది. ఆ కుక్క మీద అంత మక్కువ మంచిది కాదని గ్రహించిన యజమాని దాన్ని ఎలాగైనా వదిలించు కోవాలని నిశ్చయించుకున్నాడు. కానీ కుక్క ఎప్పటిలాగే యజమాని తనను ఆదరిస్తాడని అతని చుట్టూ తిరుగు తూండేది. ఎన్నోసార్లు దెబ్బలు తిన్నాక యజమాని తనను నిరాదరిస్తున్నాడని తెలుసుకొని ఆ కుక్క అతణ్ణి వదిలి వెళ్ళిపోయింది.

ఆ యజమాని పెంచిన కుక్కలా మనం ఎన్నో జన్మలుగా పెంచి పోషిస్తున్న చెడు సంస్కారాల్ని ఒక్క రోజులో వదిలించు కోలేం. కాబట్టి యజమాని ఆ కుక్కను చాలా కాలం నిరాదరించినట్లు మనం చెడు భావాల్ని నిరాకరిస్తే కొన్నాళ్ళకు అవి మనల్ని వదిలిపోతాయి.

చెడు ఆలోచనలనూ, అలవాట్లనూ ఎదుర్కోవాలంటే మనస్సుకు మంచి భావాలను అందించడమే పరిష్కార మని స్వామి వివేకానంద అంటారు.

The only remedy for bad habits is counter habits; all the bad habits that have left their impressions are to be controlled by good habits. Go on doing good, thinking holy thoughts continuously; that is the only way to suppress base impressions.

-Swami Vivekananda

మనస్సనే గదిలో దీపం అనే మంచి ఆలోచనల్ని వెలిగిస్తే చీకటనే చెడు భావాలు పారిపోతాయి. అందుకని మనస్సును మంచి భావాలతో నింపే మంచి సాహిత్యాన్ని చదవండి, మంచివారితో సాన్నిహిత్యాన్ని పెంచుకోండి. మీ విధుల్ని సేవా భావంతో నిర్వర్తించండి. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029



విజయ సూత్రం!

– అమిరప్పు నటరాజన్

సగటు మనిషికి కలిగే ఆలోచనలన్నీ 'నేను-నాది' అనే మాటల పరిధిలోనే ఉంటాయి. 'నేను కష్టాల్లో ఉన్నాను, నేను బాధలుపడుతున్నాను'. మరొక పక్క పనిచేసేటప్పుడు 'నాకు కష్టంగా ఉంది. ఈ పని చేయలేను' అన్న ఆలోచనలు మనిషి మనస్సులో నిండి ఉంటాయి. ఈ రెండు రకాల ఆలోచనలవల్ల మనిషి తాను చేసే పని నిష్ఠగా చెయ్యలేడు.

పుట్టుక నుంచి చావు వరకూ జరిగే జీవిత ప్రయాణంలో మనిషి చేసే ఒకే ఒక్క పని ఏమిటి? మాటిమాటికీ పడగ ఎత్తుతూ ఉండే తన అహంకారాన్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తూ ఉండడమే!


"మనం ఈ జీవితంలో నేర్చుకోవలసిన గొప్ప పాఠం ఒకటి ఉంది. అది మనల్ని మనం మర్చిపోవడం. ఎల్లప్పుడూ ఇతరులకు మంచి చెయ్యడానికి ప్రయత్నించడం. దీని ద్వారా మనల్ని మనం మర్చిపోతాం. ఎప్పుడు మనం "నేను, నాది" అనే భావన లేకుండా పనిచేస్తామో, అప్పుడే అత్యుత్తమంగా పనిచేస్తాం. ఇతరుల మీద అంత ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతాం" అని స్వామి వివేకానంద వివరించారు.

ఏ చిన్న పని చెయ్యాలన్నా మనిషి తనను తాను మర్చిపోవాలి. అంటే అహంకారాన్ని అణచివేసుకోవాలి. అయితే, తనను తాను మర్చిపోయిన వాడు కర్తవ్యనిర్వహణ ఎలా చేస్తాడు అన్న సందేహం కలుగవచ్చు. దీనికి అర్థం ఏమిటంటే ఒకసారి లక్ష్యాన్ని నిశ్చయించుకున్న తరువాత పని మీద దృష్టి పెట్టాలి. అప్పుడే మనిషి ఆ పనిని విజయవంతంగా చెయ్యగలుగుతాడు. జీవితంలో ఔన్నత్యాన్ని పొందుతాడు. ❖

సాధన చేయుమురా నరుడా!

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

అనగ నగగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ!




భావం: రాగంలో నైపుణ్యం పెరగాలంటే అనేక పర్యాయాలు అంటూ ఉండాలి. వేప తింటూ తింటూ ఉంటే తియ్యగా అనిపిస్తుంది. ఏ పని అయినా సాధన (మాటి మాటికీ) చేస్తూ ఉంటేనే ఈ ప్రపంచంలో ఫలితాలు వస్తాయి.

వాఖ్య: ఇది గ్రహించే ఓ గేయరచయిత 'సాధన చేయుమురా నరుడా! సాధ్యము కానిది లేదురా' అన్నాడు.

పుస్తకంలోని జ్ఞానాన్ని మస్తకంలోకి తెచ్చుకోవాలి విద్యార్థి. మంచి పంట పండించాలంటే వ్యవసాయదారుడు భూమిని బాగా దున్నాలి. ఉద్యోగంలో ఉన్నత స్థానం అధిరోహించాలంటే పరిశ్రమించాలి. ముఖ్యంగా మనశ్శాంతి పొందాలంటే కామ క్రోధాది అరిషడ్వర్గాలు దరి చేరకుండా, మనస్సును పరమాత్మ వైపు మళ్ళించాలి. పాట బాగా పాడడానికి, వేప రుచి తియ్యగా అనిపించడానికీ మాత్రమే వేమన సాధన గురించి చెప్పినట్లనిపించినా ఆయన దృష్టి ప్రధానంగా లౌకికం కన్నా పారలౌకికం పైనే ఉంది. సాధన కూడా నిర్మలమైన మనస్సుతో చేయాలి.

ఇంటికి సంబంధించి, ఒంటికి సంబంధించి, సమాజానికి సంబంధించి ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. వాటిని నిరోధించాలి. ఆ నిరోధంలో మనస్సు శూన్యమవుతుంది. అయితే అంతకు పూర్వం ఉన్న వాసనలు కల్లోలపరుస్తాయి. అవి స్మృతిపథంలోకి రాకుండా పవిత్రమైన పరమాత్మను మనస్సులో నిలపాలి. అప్పుడు ముక్తి సిద్ధిస్తుంది. జీవన్ముక్తి సిద్ధిస్తుంది. ధ్రువ, ప్రహ్లాద, అంబరీష, రంతిదేవ, నారదాదులు ఇదే పని చేశారు. అందుకే 'సాధన చేయుమురా నరుడా!' అని మనం కూడా ఎలుగెత్తి చాటుదాం. ❖



వార్ధక్యమూ వైభవమే...

– బి. సైదులు

జీవితంలో యౌవనం తొలిసంధ్య లాంటిదయితే... వార్ధక్యం మలిసంధ్యలాంటిది. తడబాట్లకు, తప్పటడు గులకు పశ్చాత్తాప పడే ప్రాయం వృద్ధాప్యమే! మనతో మనం ఏకాంతంగా గడపాల్సిన నిర్బంధ కాలమదే! అలాంటి జీవన చరమాంక ప్రశాంత పరిసమాప్తికి బీజాలు పడాల్సింది బ్రతుకు తొలినాళ్ళలోనే! "అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనమ్" అంటుంది మన సనాతన ధర్మం; దీనాతిదీనంగా కాలం గడపకుండా, అనాయాసంగా ఈ జీవన యవనిక నుంచి నిష్క్రమించడమే నిజమైన విజయం. ఎవరి జీవిత సాఫల్య మైనా వారి తుదిదినాలపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే బ్రతుకు ఆరంభం నుంచే అడుగులు ఆచి తూచి వేస్తే అంతిమక్షణాలు అంత ప్రశాంతంగా, వైభవంగా సాగిపోతాయి. కానీ దురదృష్ట వశాత్తూ నేడు ఎందరో జీవితాల మలి సంధ్యలు మరకలతో మసిబారు తున్నాయి. ప్రణాళిక లోపించిన యుక్తవయసు పరి తాపంతో కూడిన వార్ధక్యానికే దారి తీస్తుంది.

ముగింపు ముఖ్యం....

ఏ నాటకమైనా... చలనచిత్రమైనా ముగింపు ఆకట్టు కుంటేనే విజయవంతమయింది అని భావిస్తాం. మన జీవితమూ అంతే! పసితనం, యౌవనం... ఇవన్నీ కూడా లెక్కలోకి రావు. ముదిమి ప్రాయం ఎలా ముగిసిందనేది ముఖ్యం. వేలకోట్లు సంపాదించిన వారు కూడా కట్టకడపటికి కడు దయనీయంగా కన్నుమూసిన సందర్భాలు ఎన్నో! అందుకే భక్త కబీర్ అంటారు...

మాలీ ఆవత్ దేఖికే కలియా కరీ పుకార్

ఫూలీ, ఫూలీ చున్‌లియా కాల్

హమారీ బార్... సమీపిస్తున్న తోటమాలిని చూసి మొగ్గలు విలపిస్తాయట; విరబూసిన పూలు ఈ రోజు కోతకు గురయ్యాయి; రేపు మన వంతూ రాక మానదు; ఆ మృత్యువును ఆలింగనం చేసుకోకా తప్పదు అని. ఈ భావనను నిరంతరం స్మరించుకుంటూ ఉంటే, ఈ ప్రపంచంపై ఇంత తాపత్రయం పెంచుకునే అవకాశం ఉండదు. సామ్రాట్టుల నుంచి సామాన్యుల వరకు అందరం ఏదో ఒకరోజు ఈ లోకం నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమిస్తామని తెలుసుకుంటే, ఇప్పటికన్నా మరింత అర్థవంతంగా, సౌహార్దంగా మసలుకోగలం. ఫలవంతంగా పనిచేయగలం.

ఫలాలే పరిహారాలు...

పుణ్యాత్వ ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవః

న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః....

అంటోంది యోగవాషిష్ఠం. మానవులు పుణ్యఫలాలైన సుఖశాంతులు కోరుకుంటారు; కాని పుణ్యకర్మలకు మాత్రం ప్రయత్నించరు. పాపఫలాలైన దుఃఖాదులను దూరంగా ఉంచాలనుకుంటారు; కాని ప్రయత్నపూర్వకంగా పాపకర్మలనే ఆచరిస్తూ ఉంటారు. ఎంత దౌర్భాగ్యమో చూడండి. మనం చేసేవి మాత్రం పాపాలు, కోరుకునేవి మాత్రం పుణ్యఫలాలు! వయసులో ఉన్నన్నాళ్ళూ నా వాళ్ళూ, నా పిల్లలు, నా ఇల్లు.... ఇదే యావ! కన్న బిడ్డలకు కోట్లు సంపాదించి పెట్టినా వారు దానిని మన కర్తవ్యంగానే భావిస్తారు; అతి సాధారణంగా తీసుకుంటారు; అదే పరాయి బిడ్డలకు పిడికెడు అన్నం పెట్టినా కలకాలం కృతజ్ఞతగా స్మరించుకుంటారు. కాని బాధాకరమైన విషయమేమంటే మనలో చాలామంది వయసు మళ్ళాక కూడా "నా" అన్న భావన నుంచి కొద్దిగా కూడా విశాలంగా ఆలోచించరు. మనవారు కాదనుకున్న వారిని కనీసం ప్రేమతోనైనా పలకరించరు.

ఆ వయసులోనూ ఆనందమే...

మానసికంగా పరిపక్వత సాధించాలనేవారు శ్రీరామకృష్ణులు. పక్వానికి రాని ఫలాలు వాటంతట అవి రాలవు; పండనిస్తే దానంతట అదే రాలిపోతుందనేవారు ఆయన. ఇలా మీ శక్తులు విపాకం చెందిన కొద్దీ మీకూ, మీ శరీరానికీ మధ్య దూరం ఏర్పడుతుంది; ఇలా శరీరానికి దూరమయ్యాక ఇక దానికి సంబంధించిన ఏ విషయానికీ మీరు బద్ధులు కాలేరు. నిస్వార్థంగా మారిపోతారు. అప్పుడు జీవితంలో



ఇతర దశలు ఎంత అందంగా ఉంటాయో వృద్ధాప్యం కూడా అంతే అందంగా, ఆనందంగా ఉంటుంది; ఎందుకంటే జీవితానుభవమంతా మీకు బాసటగా ఉంటుంది. జీవన ప్రణాళికా ప్రక్రియలో దెబ్బతిని ఉంటే మాత్రం వృద్ధాప్యం బాధాకరమే!

పరిణతే పెద్దరికం...


తలలు తెల్లపడడమో, ముఖం ముడతలు పడడమో పెద్దరికం కాదు. బౌద్ధికంగా, మానసికంగా పరిణతిని సాధించాలి. ఇటీవల ఎన్నో పత్రికల్లో డెబ్బై ఏళ్ళు దాటిన వారు కూడా ఆశ్చర్యకరమైన ప్రశ్నలతో ఉత్తరాలు రాస్తున్నారు; అంటే అప్పటికి కూడా శరీరాన్ని మించి ఆలోచించకపోవడం ఆందోళనకరం. ఐహిక భావనలతో, సుఖలాలసలో బ్రతుకుకు ముగింపు పలికితే, మరుజన్మ కూడా అలాంటి తాపత్రయాలతోనే ఆరంభమవుతుందని గుర్తించాలి. ముందుతరాలకు ఆదర్శనీయమైన అడుగుజాడలు పరచగలిగేలా గమనాన్ని తీర్చిదిద్దుకోవాలి. మా తాత మిలియనీర్ అనే కన్నా మా తాత మహాత్మాగాంధీ అంటుంటే పిల్లలు ఎంత మురిసిపోతారో ఊహించుకోండి.

పరుగు ఆపడమే ప్రతిభ...

ఏ మార్గాన్ని అనుసరించేవారికైనా జీవితంలో తప్పనిసరిగా కొందరితో సంబంధం ఏర్పడుతుంది; జన్మవల్లనో, ప్రేమ వల్లనో, కలయిక వల్లనో... ఇలా ఏదోవిధంగా! కాని ఆ సంబంధాల్లోని అనందర్భాన్ని, అనంగత్వాన్ని, అసత్యాన్ని ఎవరైతే త్వరగా గుర్తిస్తారో వారు వియోగ సమయంలో విచారించరు... దుఃఖించరు అంటాడు గౌతమ బుద్ధుడు. ఈ రోజుల్లో మనలో చాలామంది దురదృష్టవశాత్తూ మృత్యుపాశంలో చిక్కుకునే వరకూ కూడా ఈ మానసిక స్థితికి చేరుకోలేకపోతున్నారు. ఒక వయసు నుంచే ఈ నిస్సంగత్వాన్ని అలవరచుకుంటూ ఉండాలి. అప్పుడే వార్ధక్యంలో అనుబంధాల విషయంలో అనురక్తి తగ్గుముఖం పడుతుంది. ఈ శరీరంలో శక్తి సన్నగిల్లాక పరుగు ఆపడంలో ప్రత్యేకత ఏమీ లేదు! పరుగెత్తగలిగీ కూడా ఇక చాలు ఈ పందెం అనుకోవడంలోనే మన పరిణతి ప్రస్ఫుటమవుతుంది. ముళ్ళు గుచ్చుకోకూడదనుకుంటే మన కాలికి చెప్పులేసుకోవాలే కాని, దారంతా తోలు పరుచుకుంటూ పోలేం కదా! అదే విధంగా మన మనసుకు ఇక చాలు అని సర్దిచెప్పగలిగితే కలిగే కోరికలన్నింటికీ కళ్ళెం వేయగలం; పరుగు ఆపి పదిలంగా కూర్చోగలం.

ఆశ్రమ ధర్మమే అనుసరణీయం...


సనాతన ధర్మంలో మనం ఆచరించాల్సిన విధులను అద్భుతంగా వివరించారు. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాల గుండా జీవితం సాగిపోవాలి. అప్పుడే మానవుడు సంపూర్ణంగా, సంతృప్తికరంగా ప్రస్థానాన్ని ముగించగలడు. ముందు బ్రహ్మచర్య ధర్మంతో యౌవనం వరకు విద్యాభ్యాసాలతో, ఉపాధి కల్పనతో జీవితంలో స్థిరపడాలి; గృహస్థ ధర్మంలో బాధ్యతాయుతంగా జీవిస్తూ ఐహిక విజయాలను సాధించి సంతానాన్ని ఒక స్థాయికి చేర్చాలి; ఇక వానప్రస్థ ధర్మంలో కుటుంబంపై అనురక్తిని తగ్గించుకుంటూ, నిస్సంగత్వాన్ని అలవరచుకోవాలి; తుదకు సన్న్యాసాశ్రమంలో మానసికంగా, శారీరకంగా తమ అన్నవారికి దూరంగా దైవచింతనలో గడపాలి. కాని ఈతరంలో ఈ ఆశ్రమ ధర్మాలన్నీ అస్తవ్యస్తమైపోయాయి. అలజడితో, అస్పష్టతలతో కూడిన యౌవన కాలం బ్రహ్మచర్య ధర్మాన్ని; బాధ్యత లేని వ్యవహారాలు గృహస్థ ధర్మాన్ని, తీరని వాంఛలు వానప్రస్థ ధర్మాన్ని, పశ్చాత్తాప భావనలు సన్న్యాస ధర్మాన్ని ఆవహించి వేస్తున్నాయి. ఫలితంగానే వార్ధక్యంలో కూడా చాలా మంది ముఖాల్లో కలతలు, కల్లోలాలు. స్వామి వివేకానంద అన్నట్లు ప్రకృతి ఆ చెంపా ఈ చెంపా వాయించిన తరువాత అప్పుడు మానవులకి వైరాగ్యం అలవడుతుంది. అందుకే మానవ జీవన శిల్పానికి బాల్యం, యౌవనం అసంపూర్ణ అలంకరణలు; విజయవంతమైన వార్ధక్యమనే స్వర్ణకిరీటం ధరించినప్పుడే అది సంపూర్ణ అలంకరణ. ❖



విషయానందాన్ని వీడాలి....

విషయానందం నుంచి బ్రహ్మానంద స్థితికి ఎంత త్వరగా చేరుకుంటే వార్ధక్యంలో అంత ప్రశాంతంగా ఉండగలం. జీవితంలో యుక్తవయసుకు సంబంధించిన లంపటాలన్నింటినీ వృద్ధాప్యానికి పొడిగించుకోకండి. యౌవనం కన్నా వార్ధక్యానికున్న ప్రత్యేకత 'అనుభవసారం'. అలా అపారమైన జీవితానుభవాలతో పాఠాలు నేర్చుకొని ముందుతరానికి దిక్సూచిగా నిలవాల్సింది పెద్దవారే. ఈశోపనిషత్తు ఈ అంత్యదశ చింతనను అద్భుతంగా వర్ణించింది. మలిసంధ్యలోనూ ప్రశాంతంగా, పరిపూర్ణంగా పరిసమాప్తమయ్యేందుకు భారతీయ ఆధ్యాత్మికత మార్గాన్ని చూపగలదు. మృత్యువును కూడా గంభీరంగా స్వాగతించేందుకు ధైర్యాన్ని ప్రసాదించగలదు. ❖

– స్వామి రంగనాథానంద



అభ్యున్నతికి

అవసరం బ్రహ్మచర్యం

– స్వామి రఘునాయకానంద

లోకాన్ని ఎవరు జయించగలరు? 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో వారే లోకాన్ని జయించగలరు' అని శంకరాచార్యులు చెప్పారు. మనస్సును జయించడం అంత తేలికైన పని కాదు. బాహ్య, అంతర అవరోధాలను ఎదుర్కొని, బ్రహ్మచర్యం పాటించినప్పుడే మనస్సును జయించగలం. ఈ రోజులలో యువతరానికి బ్రహ్మచర్యం గురించి బోధించడం చాలా కష్టమైన పని. నైతిక, ఆధ్యాత్మిక విలువలను ఆచరించకపోవడం వల్ల, బ్రహ్మచర్య సాధన పట్ల అవగాహన లేకపోవడం వల్ల యువత పెడదోవ పడుతోంది. ఫలితంగా సర్వత్రా నైతిక, ఆధ్యాత్మిక పతనం కనిపిస్తోంది.

బ్రహ్మచర్యం పట్ల అపోహలు

బ్రహ్మచర్య సాధన సాధ్యం కాదని ఈనాటి యువతరం భావిస్తోంది. బ్రహ్మచర్యం పాటిస్తే సృష్టి ఎలా జరుగుతుందని చాలా మంది ప్రశ్నిస్తుంటారు? సృష్టిని మనం సృష్టించలేదు కదా? అది ఎలా జరుగుతుందని దిగులెందుకు? ముఖ్యంగా యువకులుగా మీ లక్ష్యాలను చేరుకొనే వరకు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. సమాజంలో వివాహ వ్యవస్థను పెట్టింది సమాజానికి ఉన్నతమైన సంతానాన్ని అందించడానికే కానీ, విషయసుఖాల కోసం కాదు. జీవితాంతం అఖండ బ్రహ్మచర్యాన్ని పాటించడం కూడా సాధ్యమే. అలాంటివారు ఉన్నతమైన లక్ష్యాల దిశగా వారి మనస్సును మరల్చాలి. నిరంతర ఆధ్యాత్మిక సాధనలలో మునిగిపోవాలి. బ్రహ్మచర్యం అంటే భగవంతుణ్ణి ప్రత్యక్షం చేసుకోవడానికి దారి తీసే జీవన విధానమని అర్థం.

బ్రహ్మచర్య సాధన ఎలా?

ఈ రోజులలో యువతరం చాలామంది బ్రహ్మచర్య పాలనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఈ బ్రహ్మచర్య పాలన ఎక్కడో అడవులలో ఉండే సాధువులకు మాత్రమే అని భావిస్తుంటారు. నిజానికి దృఢమైన, ఆరోగ్యమైన, అర్థవంతమైన వ్యక్తిత్వం కోరుకొనే ప్రతి ఒక్కరికీ బ్రహ్మచర్యం అవసరం. బ్రహ్మచర్య సాధనకు ఉపయోగపడే కొన్ని సూత్రాలు:

1. మన ఆలోచనలలో, చేసే పనులలో ఎంతైనా జాగురూకత అవసరం. ఉదాత్తమైన ఆలోచనలతో, క్రమశిక్షణాయుత జీవితాన్ని గడపాలి. మనం ఆలోచించే ప్రతీ విషయం, చేసే ప్రతీ పని మన మనస్సును ప్రభావితం చేస్తాయన్న సంగతి ఎప్పుడూ మరువకూడదు.
2. చలన చిత్రాలు, ఇంటర్‌నెట్ వంటి ప్రసార మాధ్యమాల విషయాల్లో మరింత జాగురూకత వహించాలి. చూసే చిత్రాలు మనస్సుపై అమిత ప్రభావాన్ని చూపుతాయి.
3. ఒక ఆదర్శ వ్యక్తిని మీ నాయకుడిగా ఎంచుకొని, ఆయన అడుగుజాడలలో నడవాలి. ఏ ఆదర్శ వ్యక్తిత్వం అయితే మన జీవితాలలో మార్పును తీసుకువస్తుందో అలాంటి వ్యక్తులనే నాయకులుగా ఎంచుకోవాలి. ఉదాహరణకు స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ, శ్రీశారదాదేవి, రామకృష్ణ పరమహంస లాంటి మహాపురుషుల జీవితాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. వారి అడుగుజాడలలో నడవాలి.
4. బ్రహ్మచర్య పాలనకు కావాల్సిన శక్తియుక్తుల్ని ఇవ్వాల్సిందిగా భగవంతుణ్ణి వ్యాకులతతో ప్రార్థించాలి. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు మంచి ఆధ్యాత్మిక సాహిత్యాన్ని చదవాలి.
5. అనవసర సంభాషణలు మాని, మంచివారితో స్నేహాన్ని కలిగి ఉండాలి.
6. ఆహార విహారాల విషయంలో శ్రద్ధ వహించాలి. దైనందిన చర్యలు నిర్దిష్టంగా ఉండేలా ప్రణాళికను రూపొందించుకోవాలి.
7. ప్రతి స్త్రీనీ తల్లిగా భావించాలి. తద్వారా స్త్రీలను పవిత్ర భావంతో చూడగలుగుతారు.

ఈ విధమైన ఆలోచనలు, అలవాట్లతో యువతరం తమను తాము సంసిద్ధుల్ని చేసుకొని, వారిలో ఉన్న యువశక్తిని సరైన విధంగా కార్యరూపంలో పెట్టినప్పుడు ఘనకార్యాలు సాధించగలరు. లక్ష్యాలను ఛేదించగలరు. ❖



స్వామి ప్రేమేశానంద
(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచి
6-6-1957

ప్రియమైన సమర్!*

మనిషికి ధనం పట్ల ఉండే లోభత్వాన్ని చూసి నీవు నిర్ఘాంతపోయినట్లు తోస్తోంది. నీ కళ్ళబడని రకరకాలైన మరికొన్ని లోభ గుణాల వల్ల ప్రపంచం ఎంత అవిశ్రాంతంగా ఉంటోందో నీకు తెలియదు. రాక్షసత్వం ప్రబలి ఐరోపాలో జరిగిన మారణకాండ తాలూకు చరిత్రను మర్చిపోయావా? సీతాపహరణం అనంతరం జరిగిన రామరావణ యుద్ధంలోని రక్తపాతం, సాధ్వి సీత అగ్నిప్రవేశం నీకు జ్ఞాపకం రావడం లేదా?

ప్రపంచమంతటా "ఒక జీవిపై మరో జీవి" ఆధిపత్యం సాగుతూనే ఉంది. చిన్న చేపను పెద్ద చేప అన్న రీతిలో కీటకాలు తమ కన్న చిన్న వాటిని బలహీనమైన వాటిని పట్టుకొని భక్షిస్తాయి. ఒకసారి కళ్ళు తెరచి చూడు. నువ్వు చూసింది కొద్దిపాటి మాత్రమే. దానికే ఆశ్చర్యపోతున్నావు. నాయనా సమర్! మరీ సున్నితమైన హృదయంతో ఈ ప్రపంచంలో బ్రతకడం అసాధ్యం నాయనా! ఈ ప్రపంచ మంతా బ్రహ్మమయమని గురుమహరాజ్ స్వామీజీకి చెప్పలేదా!

ఒక కథ చెబుతాను విను. ఒక గ్రామంలో ఒక రైతుకు వృద్ధురాలైన తల్లి ఉంది. ఆమె ఒక రోజు నగరానికి వెళ్ళింది. అక్కడ కొందరు పిల్లలు ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నారు. అది చూసింది ఆమె. ఆమె తన జీవితంలో ఎన్నడూ ఆ ఆట చూసి ఎరుగదు. వారు ఒకరితో ఒకరు కలియబడడం, పోరాడడం చూసి ఆమె "నాయనలారా! దెబ్బలాడుకోకండి, కాళ్ళూ చేతులూ విరుగుతాయి" అని గట్టిగా అరవసాగింది. అది కేవలం ఆటేనని ఆమెకు నచ్చచెప్పడానికి చుట్టూ ఉన్నవాళ్ళు చాలా ప్రయాసపడాల్సి వచ్చింది. నువ్వు కూడా అదే విధంగా తప్పుడు అభిప్రాయంలో ఉన్నావు. 'హర్డిల్స్' ఆటను నువ్వు ఎప్పుడైనా చూశావా? ప్రపంచం కేవలం ఆ ఆట లాంటిది. నీకు అవకాశం చిక్కినప్పుడు ఒక వారం రోజులు ఉండేలా ఇక్కడకు రా! నీ మనస్సులో ఉన్న అశాంతినంతా అప్పుడు తీసేస్తాను.

ఒకరోజు గురుమహరాజ్ కలకత్తాలోని ఒక భక్తుని ఇంటికి గుఱ్ఱపుబండిలో వెళుతున్నారు. అలా వెళుతూ, దారిలో ఒక మేడ రెండవ అంతస్తు వరండాలో నిలబడి ఉన్న ఒక యువతిని ఆయన చూడడం సంభవించింది. రెండు చేతులూ జోడించి ఆమెకు నమస్కరిస్తూ ఇలా అన్నారు – "అమ్మా! నువ్వు ఈ రూపంలోనూ వస్తున్నావా తల్లీ!" ఆ యువతి ఒక వ్యభిచారిణి.

కనుక ఎందుకు నీవంత క్షోభపడిపోతావు! నువ్వేమైనా ఈ ప్రపంచాన్ని శాసించే ప్రభువువా? రామకృష్ణ కుటుంబంలో నువ్వు ఇప్పుడే కొత్తగా జన్మించిన శిశువువి. ఇంకా నడకే సరిగా రాని పసివాడివి. అప్పుడే ప్రపంచాన్ని వేదాంత దృష్టితో ఎలా పరికించగలవు? దానికి ఇంకా చాలా కాలం పడుతుంది.

లాంతరు ముందు కూర్చొని కిరసనాయిలు వాసన వస్తోందంటే ఎలా నాన్నా! మధురమైన సువాసనలు గ్రోలాలంటే రామకృష్ణుల పూదోటకు రావలసిందే సుమా!

ఈ ప్రపంచంలో ఇంతకన్నా సౌకర్యాలు నీకు కల్పించబడవని కచ్చితంగా చెబుతున్నాను. ఇది గురుమహరాజ్ ప్రపంచం. దాన్ని ఆయన తన ఇచ్ఛ మేరకు నడుపుకొంటారు. మౌనంగా ప్రేక్షకుడవై ఉండు. అభేద దృష్టితో చూడగలిగితే నీకు అంతా ఆనందమయమే అవుతుంది!

(* స్వామి ప్రేమేశానందజీ మహరాజ్‌చే ప్రభావితుడైన విద్యార్థి – సమరేంద్ర నారాయణదాస్.)

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

...15వ పేజీ తరువాయి.

నిత్యనిర్మలుడైన గోవిందుడికి సమర్పించేవారు వెంగమాంబ. ఆ నోటా, ఈ నోటా ఆ పరమభక్తురాలి ప్రాభవం తిరుమల క్షేత్రమంతా వ్యాపించింది. ఈ సమయంలోనే వెంగమాంబ వేంకటేశునిపై ఎన్నో పద్యాలను, శతకాలను భక్తిరసార్ద్రంగా రచించి పరవశించారు.

అలమేలుపతి ఆశీస్సులు...

ఆ తిరుమలవాసుని నామామృతాన్ని సేవిస్తూ సేదతీరుతున్న తరిగొండ వెంగమాంబకు స్థిరనివాసానికి సంబంధించిన సమస్య ఎదురైంది. నిలువ నీడలేక గుడి ఆవరణలోనో, మండపాల్లోనో తలదాచుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ సమయంలోనే ఆ పరమభక్తురాలు తిరుమల క్షేత్రంలోనే తనను స్థిరంగా ఉండేటట్లుగా అనుగ్రహించమని ఆ అలమేలుమంగా సమేతుణ్ణి పరిపరివిధాలుగా ప్రాధేయపడ్డారు. ఆత్మీయ భక్తశిఖామణి అడిగిందే తడవుగా అలమేలు పతి తన ఆంతరంగిక భక్తుడైన స్వామి హాథీరాంబాబా వారి శిష్యపరంపరలో మహంతు మఠానికి అప్పటి అధిపతి అయిన ఆత్మారాందాసుకు కలలో కనిపించి ఆదేశించారట. ఆ విధంగా ఆత్మారాందాసు ఆ ఆనందనిలయుడి ఆలయానికి సమీపంలోనే వెంగమాంబకు నివాస స్థలాన్ని ఏర్పాటు చేశారు. అక్కడే తులసీప్రియుడైన తిరుమలేశుని కోసం తులసీవనాన్ని పెంచదలచారు వెంగమాంబ. ఆ తోటకోసం ఒక దిగుడుబావి కూడా తవ్వించారు. అలా పెంచిన సుమ వనాల నుంచి ఎన్నో పూలమాలలల్లి ఆ పాపవిమోచనుణ్ణి పూజించేవారు ఆ పరమపావని. ఆవిడ తవ్వించిన దిగుడుబావి ఇప్పటికీ తిరుమల క్షేత్రంలో చూడవచ్చు.



ఆగ్రహించిన ఆపదమొక్కులవాడు

ఆ ఏడుకొండలవాడు తనను తూలనాడినా క్షమిస్తాడట, కానీ తన పరమ భక్తులను కించిత్తు అవమానించినా కోపోద్రిక్తుడవుతాడట. ఒకనాడు ఆ భక్తశిఖామణి ఆ ఆపన్నివారుడిని పూజించి భక్తిరసార్ద్రచిత్తయై ఇంటికి చేరుకొని, పెరటిలో పీఠంపై కూర్చొని అనంతప్రకాశమైన ఆ ఆనందనిలయ విమానశిఖరాన్ని తదేకంగా వీక్షిస్తూ ధ్యాననిమగ్నమయ్యారు. సరిగ్గా అపరాహ్ణవేళ పక్క ఇంటిలోని అర్చకుడు అక్కారం దీక్షితులు, అతని బంధువులు భోజనాలు ముగించుకొని ఎంగిలి విస్తళ్ళను వెంగమాంబ తులసీవనంలోకి విసిరివేశారు. ఎప్పటి నుంచో వారికి ఈ యోగినిపై ఉన్న ఈర్ష్యాద్వేషాలను ఈ విధంగా ప్రదర్శించి అవమానించారు. ఈ విస్తరాకులు పడగానే ఆమెకు ధ్యానభంగమైంది. వెంటనే వెంగమాంబను ఆ వేంకటేశుడు ఆవహించాడు. వెంగమాంబ ఆగ్రహోదగ్రురాలై 'పాపీ! నేటితో నీ వంశం సరి! సమూలంగా నశించుగాక!' అంటూ శపించారు. ఒక్కసారిగా ఎక్కడివారక్కడే రక్తం కక్కుకుంటూ చతికిలబడ్డారు. వారిలో అర్చకుడి కుమారుడు ఒక్కడే కాళ్లీడ్చుకుంటూ వెళ్ళి వెంగమాంబను శరణువేడాడు. ఆమె శాంతించి 'ఇప్పటి నుంచి మీ వంశంలో ఒక్కొక్కడు మాత్రమే మిగులుగాక' అంటూ శాప తీవ్రతను తగ్గించారు.

ఆనందనిలయుడి ఆత్మీయసేవిక...

భావంలో, బాహ్యంలో అంతటా వెంగమాంబకు ఆ భాగవతప్రియుడే సర్వం అయ్యాడు. ఆ పరంపరలోనే ఆమె "విష్ణుపారిజాతం" అనే యక్షగానాన్ని రచించారు. అలా ఆ ప్రత్యక్షదైవానికి ఎన్నో కావ్యాలను రచించి అంకితమిచ్చారు వెంగమాంబ. ఆ విధంగా ఆ ఆనందనిలయుడికి ఆత్మీయసేవికగా మారిపోయారు. నిరంతరం ఆమె స్వామిని కీర్తిస్తూ, సేవిస్తూ కాలం గడిపేవారు. సాక్షాత్తూ శ్రీనివాసుడే ఆమెతో మాట్లాడేవాడని, ఆమె గానాన్ని పరవశించి వింటాడని, నర్తిస్తాడని తిరుమల క్షేత్రమంతా ప్రచారమైంది; వెంగమ్మను ఆ వేంకటేశుని అంశ కలిగిన మహనీయురాలిగా భక్తులంతా భావించేవారు.

ఆదరించిన అన్నమయ్య వంశీకులు...

ఈ శుభతరుణంలోనే తరిగొండ వెంగమాంబ ప్రాభవం తాళ్ళపాక అన్నమయ్య వంశీకుల వరకూ పాకింది. ఆ తిరుమలవాసుని సేవలో ప్రముఖంగా పాలుపంచుకుంటున్న తాళ్ళపాక వంశీయులు వెంగమాంబ మహిమలు, భక్తి రచనల గురించి విన్నారు. పైగా వెంగమాంబ పరమ భక్తురాలు కావడం వల్ల అన్నమయ్య వారసులు ఆమెను ఆదరించదలచారు. ఆమెను ఆహ్వానించి తిరుమల ఉత్తరమాడావీథిలో వరాహస్వామి ఆలయం వెనుక తాము నివాస ముంటున్న గృహంలో కొంతభాగాన్ని ఆమెకు కేటాయించారు.

తాళ్ళపాక వారి లాలి తరిగొండవారిహారతి

ఆ పురాణపురుషుడి పదసేవలో పునీతురాలైన వెంగమాంబ అర్చన, హారతి సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. నేటికీ ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ సమయంలో చివరగా ఆ ఆపద్బాంధవుడిని అన్నమాచార్యుల వంశీయులు "జో అచ్యుతానంద! జోజో ముకుందా! లాలి! పరమానంద! రామ!గోవిందా!" అంటూ పవళింప చేస్తారు; తరిగొండ వెంగమాంబ వంశీయులు ముత్యాలహారతిని పడతారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆనతితో సహస్రచంద్ర దర్శనం చేసిన వృద్ధతపస్విని వెంగమాంబ 1817 ఈశ్వరనామ సంవత్సరంలో శ్రావణ మాసంలో శుద్ధనవమి నాడు తనువు చాలించ దలచి సమాధిలోకి ప్రవేశించారు. ఆ దివ్యచరిత సజీవంగా సమాధిలో ప్రవేశించిన అనంతరం సమాధిని సుగంధ ద్రవ్యాలతో మూసివేసి, దానిపైన తులసీ బృందావనాన్ని నిర్మించారు. ఈ బృందావనాన్ని నేటికీ తిరుమల క్షేత్రంలో శ్రీవరాహస్వామి వారి ఆలయానికి ఉత్తర దిక్కున దర్శించి పునీతులమవ్వచ్చు. ❖



విద్యార్థి దశలోనే ఉషోదయం

- జిల్లా ప్రభు

స్వాతంత్ర్యం రాక ముందు రోజులు అవి...
పదిహేనేళ్ళ వయస్సున్న ఓ విద్యార్థి...
ప్రతి రోజూ కళాశాలకు వెళ్ళేవాడు...

ఒక రోజు ఆ దారిలో ఒక ముసలి బిచ్చగత్తె కూర్చొని ఉంది. తల ముగ్గుబుట్టలా నెరిసిపోయింది. ముఖమంతా ముడతలు పడి ఉంది. కడుపు వెన్నును తాకిందా అన్నట్లు డొక్క లోపలకు పోయి ఉంది. చిరిగిపోయిన చీర ధరించి బిక్కుబిక్కుమంటూ దీనంగా కూర్చొని ఉంది. ఆమెకు ఏదైనా సహాయం చేయాలని ఆలోచించాడు ఆ విద్యార్థి. అయితే అదీ తన తండ్రి పంపిన డబ్బుతో కాదు, తను కష్టపడి సంపాదించిన డబ్బుతో!

కలకత్తాలో వాళ్ళుండే చోటుకు మూడు కిలోమీటర్ల దూరంలో ప్రెసిడెన్సీ కళాశాల ఉండేది. ప్రతి రోజూ ఆ విద్యార్థి కళాశాలకి ట్రామ్‌పై వెళ్ళి వచ్చేవాడు. ఆ రోజు నుండి అక్కడకు నడిచి వెళుతూ, ట్రామ్‌లో కట్టే టికెట్ డబ్బును ఆ ముసలి బిచ్చగత్తెకు ఇచ్చి కొంత ఆకలి తీర్చేవాడు. దేశంలోని వాస్తవిక పరిస్థితిని గమనించి, 'అన్ని చోట్లా దారిద్ర్యం, దైన్యం, అజ్ఞానం, ఆకలి రాజ్యమేలుతున్నాయి. దీన్నెవరు మారుస్తారు? ఇంత పెద్ద పనిని ఎవరు చేస్తారు'అని ప్రశ్నించుకున్నాడు. ఉషోదయపు అందాలను చూడాలనుకుంటే చిమ్మచీకటి రాత్రిని గడపాల్సిందే! స్వాతంత్ర్యపు ఆనందం పొందాలనుకుంటే దానికి అవసరమైన పూర్తి మూల్యం చెల్లించాల్సిందేనని చాటిన ఆ విద్యార్థే - ఆ తరువాత కాలంలో మాతృభూమి దాస్యశృంఖలాలను తెంచడానికి పాటుపడి అత్యున్నత పదవిని త్యజించిన ఘనుడు. Give me blood, I will give you freedom అని యువతరానికి ప్రేరణనిచ్చిన సాహసి, 'జైహింద్' నినాదాన్ని జాతికి అందించిన నేత, 'ఆజాద్ హింద్ ఫౌజ్' నిర్మాత అయిన 'నేతాజీ' సుభాష్ చంద్రబోస్. ❖

ఆదాయం కన్నా, అందరి స్వస్థత ముఖ్యం!

- గుళ్ళపూడి శ్రీనివాసకుమార్

తమిళనాడులోని సేలం పట్టణంలో ఒక పెద్దమనిషికి సొంత ఇల్లుంది. ఆ ఇంటిని 35 వేల రూపాయలకు అమ్మాలని నిర్ణయించుకున్నారు. అయితే, ఆ ఇల్లు కొనేవారు ఎవరైనప్పటికీ అక్కడ ఒక ఆసుపత్రి ఏర్పాటు చెయ్యాలనే నిబంధన విధించారు.



ఒకాయన ఆ ఇంటిని 50 వేల రూపాయలకు కొనడానికి ముందుకు వచ్చారు. అంత ధర పలికినా సరే ఇంటి యజమాని అంగీకరించ లేదు. ఆ ఇల్లు వ్యాపారం కోసం కాదనీ, తాము నివసించిన స్థలంలో ఒక ఆసుపత్రి ఏర్పాటు జరగాలని కోరుతున్నామనీ, ఆ ఉద్దేశంతో వచ్చేవారికి మాత్రమే ఇల్లు అమ్ముతామనీ స్పష్టం చేశారు ఆ పెద్దాయన.

ఆ ప్రకారమే ఆయన ఆ ఇల్లు అమ్మడం, అక్కడ ఆసుపత్రి ఏర్పాటు కావడం జరిగాయి. తాను నివసించిన ఇల్లు ఒక ఆసుపత్రి రూపంలో ఎందరికో స్వస్థత చేకూర్చి కొత్త జీవితాలను ప్రసాదించాలని ఆశించినవారు ఎవరో తెలుసా? పరిపాలనా దక్షతకు, రాజకీయ చతురతకు మారుపేరుగా నిలిచి, భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా సేవలందించి ''రాజాజీ''గా అందరిచే పిలిపించుకున్న చక్రవర్తుల రాజగోపాలాచారి.

ప్రజాజీవితంలోకి అడుగుపెట్టాలని భావించిన వారెవరైనా తమ జీవితంలో ఒక్కసారి రాజాజీ ఏర్పాటు చేసిన తిరువాలంగాడు ఆశ్రమాన్ని దర్శించాల్సిన అవసరం ఉందని చెబుతుంటారు. ❖

RAMAKRISHNA MISSION
P.O. BELUR MATH, DIST. HOWRAH, WEST BENGAL - 711 202
ఫోన్ : 033- 2654 1144/1180, Email : rkmhq@vsnl.com, Website: www. belurmath.org

రామకృష్ణ మిషన్ పాలక వర్గ సంగ్రహ నివేదిక 2008 - 2009

రామకృష్ణమిషన్ 100వ వార్షిక సర్వ సభ్య సమావేశం 2009 డిసెంబర్ 20 ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బేలూరు మఠంలో జరిగింది. 1909 మే 4 న రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ వద్ద నమోదు అయిన మిషన్ శతవసంతాలు పూర్తి చేసుకుంది.

ఈ సంవత్సరం ఒరిస్సా రాయగడలోని హతమునిగుడాలో రామకృష్ణ మిషన్ కొత్త కేంద్రం ప్రారంభమైంది.

విద్యారంగం : కొన్ని ముఖ్య ప్రణాళికలు- శారదాపీఠ విద్యామందిర కళాశాలలో బెంగాలీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సు, రహారా కేంద్రం వివేకానంద సెంటినరీ కళాశాలలో కెమిస్ట్రీ పి.జి.కోర్సు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కల్చర్ (గోల్‌పార్క్) స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్‌లో కమ్యూనికేటివ్ జర్మన్, కమ్యూనికేటివ్ చైనీస్, బిజినెస్ చైనీస్ అనే మూడు కోర్సులు, చదువు నిలిపివేసిన పిల్లలకు కోయంబత్తూర్ కేంద్రంలోని పారిశ్రామిక శిక్షణాసంస్థలో ఇండస్ట్రీ స్పాన్సర్డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం, స్కిల్ ట్రైనింగ్ ఆన్ కన్‌స్ట్రక్షన్ కోర్సులు, లక్నో కేంద్రంలోని వివేకానంద పాలీక్లీనిక్‌లో ప్లాస్టిక్ సర్జరీ, పేథాలజీలలో పి.జి. ట్రైనింగ్ కోర్సులు, సేవాప్రతిష్ఠాన్ కేంద్రం (కోల్‌కతా)లో పోస్ట్ బేసిక్ బి.ఎస్.సి. నర్సింగ్ కళాశాలలు ప్రారంభించడం జరిగింది.

వైద్యరంగం: కొన్ని ముఖ్య ప్రణాళికలు - సేవా ప్రతిష్ఠాన్ కేంద్రంలో ఎమ్ఆర్ఐ విభాగం, లక్నో కేంద్రం వివేకానంద పాలీక్లీనిక్‌లో 24 పడకలు గల ఆర్థోపెడిక్ వార్డ్, నరేంద్రపూర్ కేంద్రంలో పంచకర్మ థెరపీ విభాగం, పురులియా కేంద్రంలో సంచార వైద్య విభాగం, బృందావన్ కేంద్రంలో ఫిజియోథెరపీ విభాగం ప్రారంభించడం జరిగింది.

గ్రామీణాభివృద్ధిరంగం : కొన్ని ముఖ్య ప్రణాళికలు- చిరపుంజి కేంద్రం 200 మంది గ్రామీణులకి తేనెటీగల పెంపకానికి అన్ని పరికరాలతోకూడిన 200 పెట్టెలను పంపిణీ చేసింది. పురులియా కేంద్రం అయోధ్య పర్వత ప్రాంతాల దగ్గర 2 చెక్‌డామ్‌ల నిర్మాణం కావించింది; గిరిజన ప్రాంతాల్లో 176 ఎకరాల సేద్యపు భూమికి నీటి పారుదల సౌకర్యం కలిగించడానికి ఛత్తీస్ గడ్‌లోని నారాయణపూర్ కేంద్రం ఒక స్టాప్‌డామ్‌ను, 3 లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టమ్స్ నిర్మించింది; శారదాపీఠ కేంద్రంలో జనశిక్షామందిర విభాగం పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో శిథిలావస్థలో నున్న 25 నిరుపేద గ్రామీణుల ఇళ్ళను పునర్నిర్మించింది. నరేంద్రపూర్ (కోల్‌కతా) కేంద్రంలో లోకశిక్షా పరిషత్ మసాలా దినుసుల సాగుబడికి, వరి పంటలో నవీకరణకు, ఫ్లోరైడ్ ఉపశమనానికి ప్రత్యేక శిక్షణా కోర్సులను ప్రారంభించింది.

కేరళలోని హరిపాడ్‌లోను, రాజర్‌హట్ విష్ణుపూర్ (కోల్‌కతా) లోను కొత్త రామకృష్ణ మఠ కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

రామకృష్ణ మఠాల్లోని అభివృద్ధి కార్యక్రమాలు : కాంకుర్‌గాఛీ (కోల్‌కతా) కేంద్రం వ్యక్తిత్వవికాస కార్యక్రమంపై దృశ్య-శ్రవణ విభాగాన్నీ, బారాసాత్ (కోల్‌కతా) కేంద్రం సంచార వైద్య విభాగాన్నీ, రాజ్‌కోట్ కేంద్రం కంటి రక్షణ కేంద్రాన్నీ; అల్సూర్ (బెంగుళూరు) కేంద్రం యువతకి అవగాహనా కార్యక్రమాల్నీ ప్రారంభించాయి.

విదేశాలలో అభివృద్ధి కార్యక్రమాలు : రామకృష్ణ మఠ నూతన కేంద్రం రష్యా, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రారంభమైంది. దక్షిణాఫ్రికాలోని దర్బన్ కేంద్రం అవసాన దశలో ఉన్న రోగులకు 35 పడకలు గల భవనాన్ని నిర్మించింది. జర్మనీ కేంద్రం ఫ్రాంక్‌ఫర్ట్ దగ్గర కొత్త భవనంలోనికి మారింది. జపాన్ కేంద్రం శ్రీమద్భాగవతం, శ్రీరామకృష్ణుల శిష్యులు, వేదాంతం - అనే మూడు గ్రంథాలను జపనీస్ భాషలో ప్రచురించింది. బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ కేంద్రం ఒక కంప్యూటర్ సెంటర్‌ని ప్రారంభించగా దీనజ్‌పూర్ కేంద్రం విద్యార్థులకు ఆవాస భవన నిర్మాణం కావించింది. ఢాకా కేంద్రంలోని జూనియర్ హై స్కూల్ హైస్కూలుగా పరిగణించబడింది.

పునరావాస కార్యక్రమాలు : ఈ సంవత్సరంలో 6.20 కోట్ల రూపాయల వ్యయంతో రామకృష్ణ మఠం, మిషన్ల ఆధ్వర్యంలో దేశంలోని అనేక ప్రాంతాలలో చేపట్టి విస్తృత సహాయ పునారావాస కార్యక్రమాల వలన 1616గ్రామాలలోని 2.49 లక్షల కుటుంబాలకు చెందిన 10.29 లక్షల మంది లబ్ధిపొందారు.

సంక్షేమ పథకాలు : పేద విద్యార్థులకి ఉపకార వేతనాలు మంజూరు చేయడం, వృద్ధులకీ వ్యాధిగ్రస్థులకీ, నిరాధారులకీ ఆర్థిక సహాయం చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలకై అయిన ఖర్చు మొత్తం 9.54కోట్ల రూపాయలు.

వైద్యసేవలు : వైద్యరంగంలో 77.53 కోట్ల రూపాయల వ్యయంతో 15 ఆస్పత్రులు, 125 వైద్యశాలలు, 53 సంచార వైద్యశాలల ద్వారా 79.05 లక్షల మందికి పైగా ప్రజలకు వైద్య సేవలందించడం జరిగింది.

విద్యారంగం : విద్యాసంస్థలలో కిండర్‌గార్టెన్ నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ సుమారు 4.84 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరి విద్యాభ్యాసానికి 144.53 కోట్ల రూపాయల వ్యయం అయింది.

గ్రామీణ గిరిజన అభివృద్ధి పథకాలు : గ్రామీణ గిరిజన అభివృద్ధికై చేపట్టిన వివిధ పథకాల కింద 26.13 కోట్ల రూపాయలు వినియోగించడం జరిగింది.

నిరంతరం అంకిత భావంతో మాకు సహాయ సహకారాలు అందించిన సభ్యులకూ, మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

ధన్యవాదములతో...

భగవత్సేవలో
స్వామి ప్రభానంద
ప్రధాన కార్యదర్శి



ఊరును మార్చేసిన ఉపకారం, ఉపదేశం!

– శ్రీనివాస్

హైదరాబాద్ శివార్లలోని కర్మాగారాల్లో పనిచెయ్యడానికి వచ్చి, స్థిరపడుతున్న తొంభై శాతం కుటుంబాలలో మాది ఒకటి. మా పద్మశాలిపుర గ్రామంలో దాదాపు పదేళ్ళ క్రితం కనీస వైద్య, విద్యా సదుపాయాలు లేవు. మూడో తరగతి వరకు మాత్రమే విద్య లభించేది. పదేళ్ళు నిండిన పసిపిల్లలు పనిపిల్లలు కావాల్సిన పరిస్థితి.

అలాంటి సమయంలో, అంధకారంలో చిరుదీపం వెలిగించినట్లు మా జీవితాలలో శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద ప్రవేశించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా 'గ్రామశ్రీ' పేరుతో ప్రతి ఆదివారం మా గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్యం అంది స్తున్నారు. బాలబాలికలకు 'స్వామి వివేకానంద బాల వికాస కేంద్రం' పేరుతో 'నీతికథలు', 'భక్తికథలు', 'శ్లోకాలు', 'భగవద్గీత' నేర్పిస్తూ మా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతున్నారు. మేము నైతిక విలువలతో పాటు, అత్యున్నతమైన ఆధ్యాత్మిక విద్యను పొందుతున్నాం.

పన్నెండేళ్ళ వయస్సు నుండి స్వామి వివేకానంద స్ఫూర్తిని నరనరానా జీర్ణించుకున్న నేను, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ, పదో తరగతిలో 531 మార్కులు పొందాను. అయినప్పటికీ ఉన్నత విద్యను అందించే స్తోమత మా తల్లితండ్రులకు లేదు. "మీ మీద మీకు నమ్మకం, భగవంతునిపై నమ్మకం ఉంటే దేన్నైనా సాధించగలరు" అనే స్వామీజీ అమృతవాక్కుతో ప్రభుత్వ కళాశాలలోనే డిగ్రీ వరకు చదివి, 'ఇన్ఫోసిస్'లో ఉద్యోగం సంపాదించాను.

ప్రస్తుతం శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక ప్రకాశాలు, స్వామి వివేకానంద స్ఫూర్తి కిరణాలు ప్రతి ఇంటా ప్రసరిస్తున్న గ్రామం మాది. కొన్నేళ్ళుగా మా గ్రామ విద్యార్థులు మండల స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు.

మా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, మా జీవితాలలో వెలుగులు నింపిన రామకృష్ణ మఠ స్వామీజీలకు మేము ఎప్పటికీ ఋణపడి ఉంటాం. ❖

(శ్రీనివాస్, పద్మశాలీపురం, రంగారెడ్డి జిల్లా)



